

సెప్టెంబరులో ముహూర్తాల్లేవ్..

ఆదివారం నుంచి శుభముహూర్తాలు ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబరు నెలలో భాద్రపద మాసంలో మాత్రం ముహూర్తాలు లేవు. తిరిగి ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో అంటే అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో ముహూర్తాలు ఉన్నాయి.. తల్లిదండ్రులు కంగారుపడకుండా పెళ్లిళ్లు చేసుకోవచ్చు.. ఒక నెలలో మాత్రమే ముహూర్తాల్లేవ్..

- కారుపర్తి నాగమల్లేశ్వర సిద్ధాంతి, శుభతిథి గంటల పంచాంగకర్త, పుల్లేటికుర్రు

పెళ్లి కళ వచ్చేసిందే బాలా..

ఈ నెల 7 నుంచే మోగనుంది పెళ్లిబాజా

- 5 నుంచి శ్రావణం
- 12 రోజులు మంచి ముహూర్తాలు
- మూడు నెలల తర్వాత శుభఘడియలు
- ఏర్పాట్లలో తల్లిదండ్రులు





కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం/మండపేట : మోగనుంది పెళ్లి బాజా. మూఢం.. శూన్యమాసం.. కారణంగా మార్చి నెల నుంచి ముహూర్తాలు లేవు.. అందరూ మంచిరోజులకు ఎదురుచూస్తున్నారు. మూడు నెలల విరామం తర్వాత ముహూర్తాలు భారీగా ఉండడంతో పెళ్లి సందడి నెలకొంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మళ్లీ పెళ్లి బాజాలు భారీగా మోగ నున్నాయి. భారీ ఎత్తున పెళ్లిళ్లు చేయడానికి వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. నగలు, వస్త్రాలు, కల్యాణ మండపాలు, సన్నాయి, కేటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలో నగలు, వస్త్ర దుకాణాల్లో అప్పుడే షాపింగ్ కళ పెరిగిపోయింది. బంగారం ధర కాస్త తగ్గడంతో ఇదే మంచి సమయంగా కోట్లలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

మరో రెండు రోజుల్లోనే శ్రావణం..

ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. ఈ నెల 7 నుంచి భారీగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో మొత్తం 14 రోజులు వివాహాలకు శుభ ఘడియలుగా పండితులు చెబుతున్నారు. దీంతో ఎక్కడికక్కడ పెద్దఎత్తున ముహూర్తాలు ఖరారయ్యాయి. ముఖ్యంగా ఈనెల 18, 22, 23 తేదీల్లో అయితే ఉమ్మడి జిల్లాలో వేలల్లో పెళ్లిళ్లు ఉన్నాయి. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు 26 వేలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో ఆభరణాలు, వస్త్రాలు, డెకరేషన్, మండపాలు, సన్నాయి, కేటరింగ్ కలిపి మొత్తం రూ.520 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు జరగవచ్చని వర్తక సంఘాలు విశ్లేషిస్తున్నాయి.

మంచి ముహూర్తాలు ఇవే..

ప్రధానంగా ఈ నెలలో 7, 8, 9, 10, 13, 15, 17, 18, 19, 22, 23, 24 తేదీలు వివాహాలకు అత్యంత అనుకూలమని పంచాంగకర్తలు ప్రకటించారు. వీటిలో అత్యంత బలమైన ముహూర్తాలుగా 17, 18, 22, 23 తేదీలను పేర్కొన్నారు. దీంతో ఆయా తేదీల్లో కల్యాణ మండపాలకు యమ డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపం దొరకడం గగనమైపోతోంది. అసలు వర్షాకాలం కావడంతో కల్యాణ మండపం తప్పనిసరిగా మారింది. ఇక కొంత మంది తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లల వివాహాలు దైవ సన్నిధిలో చేసుకుంటే వారి వైవాహిక జీవితం కష్టాలు లేకుండా సాగుతుందని భావిస్తుంటారు. ఆనవాయితీగా కూడా అలా చేస్తారు. రాష్ట్రంలో తిరుపతి తర్వాత అన్నవరం, ద్వారకాతిరుమలలో అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతంటాయి. అన్నవరంలో ఏడాదికి 8 నుంచి 10 వేల జంటలు సత్యదేవుడి సాక్షిగా ఒక్కటవుతుంటాయి. శ్రావణమాసం నేపథ్యంలో సత్యదేవుడి సన్నిధిలో వివాహ మండపాలన్నీ బుకింగ్ జరిగిపోయాయి. బలమైన ముహూర్తాలున్న నాలుగు రోజుల్లో అయితే కొండపై వెయ్యికిపైగా వివాహాలు జరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్నవరం కొండపై సత్రం గదులకు సైతం భారీ డిమాండ్ నెలకొంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు భారీగా రావడంతో గదుల కేటాయింపుపై ఏంచేయాలో తెలీక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఖర్చు రూ.కోట్లలో..

కాకినాడ జిల్లావ్యాప్తంగా పల్లెలు, పట్టణాలన్నీ కలిపి 10 వేలకు పైగా వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రాజమహేంద్రవరం జిల్లా 7 వేలు, కోనసీమ జిల్లావ్యాప్తంగా 9 వేలకుపైగా పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. సరాసరి ఒక్కో వివాహానికి కనీసం రెండు లక్షలు ఖర్చు చేసినా రూ.520 కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మూడునెలలుగా గిరాకీ లేని పూల డెకరేషన్, బంగారం దుకాణాలు, క్యాటరింగ్, పురోహితులు, సన్నాయి, ఈవెంట్ ఆర్గనైజింగ్ తదితర రంగాల వ్యాపారం భారీగా పుంజుకోనుంది. ఇప్పటికే ఏ బంగారం దుకాణం చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఆభరణాల కొనుగోళ్లే రూ.150 కోట్లు దాటిపోతాయని అంచనా. పురోహితులు, మంగళ వాయిద్యకారులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.

సందడే సందడి..

పెళ్లి అనే రెండక్షరాల బంధం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమైంది. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆచితూచి శుభఘడియలను ఎంచుకుని ముడేస్తారు. తద్వారా వారి వివాహ బంధం జీవితకాలం ఎలాంటి ఆటుపోట్లకు లోనవకుండా ఉండాలని కోరుకుంటుంటారు. ఈ వివాహాలకు ఏప్రిల్ తర్వాత మూడు నెలల విరామం వచ్చింది. రెండు నెలల మూఢం, మరో నెల శూన్య మాసం రావడంతో మంచి ముహూర్తాలే లేవు. దీంతో వివాహాలన్నీ వాయిదా పడ్డాయి. ఇప్పుడు శ్రావణమాసం ప్రారంభం అవు తుండడంతో మూడు నెలల తర్వాత తిరిగి పెళ్లి కళ వచ్చేసింది. వివాహాలకు శ్రావణం శుభకరమని పండితులు చెబుతారు. ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కాగా 7 నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయి. దీంతో వేలాది మంది పెళ్లి ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్నారు. వచ్చేవి మంచిరోజులు కావడంతో గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. ఈనెల తప్పితే మళ్లీ భాద్రపదం శూన్యమాసం కావడం సెప్టెంబరులో వివాహ ముహూర్తాలు లేవు. ఈనెల శ్రావణం శుభకరంగా భావించి పెద్ద ఎత్తున వివాహాలకు నవ జంటలు సిద్ధమవుతున్నాయి.

నేడు ఎంపీ పురందేశ్వరి రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 : ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులు పరిశీలిస్తారు. విజయవాడ నుంచి ఉదయం 11 గంటలకు దేవరపల్లి మండలం గౌరీపట్నం చేరుకుని వరద ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తారు. రైతులు, అధికారులతో మాట్లాడి వరద నష్టం వివరాలను తెలుసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ఢిల్లీ నుంచి వచ్చే రైల్వే అధికారులతో, రైల్వే డీఆర్ఎం టీంతో కలసి రైల్వే సంబంధిత అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. సాయంత్రం విజయవాడ చేరుకుని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళతారు.



రౌడీ షీటర్లపై నిఘా పెట్టాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. కొత్త చట్టాల గురించి వివరించారు. ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ భౌగోళిక పరిధి, నేరాల తీరును ఎస్పీకి డీఎస్పీ అంబికా ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం సీఐ వినయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చక్రద్వారబంధం పంచాయతీ కార్యదర్శిపై డీపీవో ఆగ్రహం

రాజానగరం, ఆగస్టు 2 : మండలంలో చక్రద్వారబంధం పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు వ్యవహార శైలిపై డీపీవో దాసరి రాంబాబు మండిపడ్డారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదంటూ అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం డీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని ఎస్సీ ఏరియాతో పాటు పలు కూడళ్లలో నెలకొన్న అపారిశుద్యంపై మండిపడ్డారు. తాగునీటిని స్వయంగా పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని రికార్డులు నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై మండిపడ్డారు. గ్రామంలోని దుకాణదారులకు నోటీసులు జారీ చేయాలని గతంలో ఆదేశించినప్పటికీ కార్యదర్శి ఖాతరు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఇద్దరు సీఐలకు నో పోస్టింగ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ ఎస్పీ నరసింహ కిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీతో అంటకాగిన సీఐలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌కి పంపించారు.ఏలూరు దిశ పీఎస్ సీఐ వి.విశ్వం కొవ్వూరుటౌన్‌కి అక్కడ పనిచేస్తున్న వి.జగదీశ్వర రావును ఆకివీడుకు పంపించారు. రాజమహేంద్రవరం సీసీఎస్-2 సీఐ కె.రజనీకుమార్‌ను పాలకొల్లు టౌన్‌కి పంపించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కె.మంగాదేవిని తూర్పుగోదావరికి కేటాయించారు.పోలవరం సీఐ జి.మధుబాబును రాజమహేంద్రవరం త్రీటౌన్‌కి బదిలీ చేసి ప్రస్తుతం ఇక్కడ ఉన్న ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్‌ని వీఆర్‌కి పంపారు.కొవ్వూరు రూరల్ సీఐ పెద్దిబోయిన శ్రీనివాసరావును వీఆర్‌కి పంపుతూ ఆ స్థానాన్ని రాజమహేంద్రవరం సీసీఎస్-1 సీఐ కె.విజయ్ బాబుతో భర్తీ చేశారు. మధుబాబు గతంలో త్రీ టౌన్‌లో పనిచేయగా,మంగాదేవి ధవళేశ్వరం సీఐగా విధులు నిర్వర్తించారు.మధుబాబు పోస్టింగ్‌పై సందిగ్ధత నెలకొంది.

పదవులెవరికో!



మాకు పదవులు ఎప్పుడొస్తాయో.. ఎప్పుడిస్తారోనంటూ నాయకులు ఎదురుచూపులు చూస్తున్నారు.. కూటమి ప్రభుత్వం ఏర్పడడం.. మూడు పార్టీలు కలిసి ఉండడంతో ఎవరికి ఏ పదవి దక్కుతుందోననే అంచనాల్లో ఉన్నారు.. అయితే అధిష్ఠానం నాయకుల మధ్య వివాదాలకు తావు లేకుండా నియోజకవర్గాల్లో ఏ పార్టీకెంత అనే లెక్కలు తేల్చేసింది.. ఆ లెక్కన తమకు పదవులు కేటాయిస్తారని కూటమి నాయకులు ఆశగా ఉన్నారు..

నామినేటెడ్ పదవులకు ఎదురుచూపులు

- పోటీపడుతున్న నాయకులు
- ఎవరి ప్రయత్నాల్లో వారు
- ఎమ్మెల్యేల సిఫారసులకు డిమాండ్
- పార్టీల వారీగా శాతాలు
- టీడీపీ..60, జనసేన 30, బీజేపీ 10
- నియోజకవర్గాల వారీగా మార్పు
- ఆ లెక్కనే ఎంపిక చేయాలని నిర్ణయం
- ఆశావహుల్లో మొదలైన సందడి
- ఈ నెలలోనే ఎంపికకు సన్నాహాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎదురుచూపులు ఫలించే రోజు వచ్చింది.. రేపో మాపో నాయకులను నామినేటెడ్ పదవులు వరించనున్నాయి.. ఈ పదవుల విషయంలో కసరత్తు ఆరంభించినట్టు కొద్దిరోజుల కిందట సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో ఏ పార్టీకి ఎన్ని నామినేటెడ్ పదవులనే విషయంలో కూడా ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలుగుదేశం -జనసేన-బీజేపీ కూటమిలో నామినేటెడ్ పదవులపై ఆశలు రేకెత్తాయి.

పదవుల పంపకం ఇలా..

ఎన్నికల్లో కలిసి పోటీ చేసి ఘన విజయం సాధించి కూటమిలోని పార్టీలు..నామినేటెడ్ పదవులు ఒక పద్ధతి ప్రకారం తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చాయి. మొత్తం పదవుల్లో 60 శాతం టీడీపీ, 30 శాతం జనసేన, 10 శాతం బీజేపీ నేతలకు ఇచ్చేటట్టు మూడు పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రస్థాయి, జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవుల్లో కూడా ఇదే సూత్రాన్ని అమలు చేయనున్నారు.టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులకు 60 శాతం పదవులు వస్తాయి. జనసేనకు 30 శాతం, బీజేపీ 10 శాతం వస్తాయి. జనసేన ఎమ్మెల్యేలు ఉన్నచోట జనసేనకు 60 శాతం, 30 శాతం టీడీపీ, 10 శాతం బీజేపీకి వస్తాయి. బీజేపీ ఎమ్మెల్యే ఉన్నచోట బీజేపీకి 50 శాతం, టీడీపీ, జన సేనకు సగం సగం వస్తాయని చెబుతున్నారు.ఈ లెక్కన రాజమహేంద్రవరంసిటీ,రాజమండ్రి రూరల్, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో టీడీపీ క్యాడర్‌కు ఎక్కువ పదవులు లభిస్తాయి. నిడదవోలు, రాజానగరంలో జనసేనకు, అనపర్తిలో బీజేపీకి ఎక్కువ పదవులు వస్తాయి. రాష్ట్రస్థాయిలో కూడా నామినేటెడ్ పదవులు ఉంటాయి. ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన పెద్దలకు ఎమ్మెల్సీ పదవులు, లేదా ఛైర్మన్ పదవులు వచ్చే అవకాశం ఉంది. మిగతా క్యాడర్‌లో వారు పార్టీకి పనిచేసిన విధానం, గత ప్రభుత్వంలో వైసీపీని వ్యతి రేకించి, పార్టీకి కట్టు బడి, పార్టీ కోసం ప్రజల కోసం నిలబడిన నేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. అంతే కాకుండా సామాజికవర్గం,మతం, ప్రాంతాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.రాష్ట్ర స్థాయి ఛైర్మన్ పద వులు, టీడీడీ బోర్డు మెంబర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఛైర్మన్, డైరెక్టర్లు, ఆలయ ట్రస్టీలు, ఆర్టీసీ పద వులు, కార్పొరేషన్లకు ఛైర్మన్లు, ఏఎంసీలు, సొసైటీలు తదితర పదవులు ఉంటాయి. నియోజకవర్గానికి ఎలా లేదన్నా సుమారు 200లకు పైనే నామినేటెడ్ పదవులు ఉంటాయి. జిల్లా లెక్కన తీసుకుంటే సుమారు 2 వేలు పైనే ఉంటాయి.ఆయా పదవులకు తీవ్ర పోటీ ఉంటుంది. బీసీ సామాజిక వర్గాల్లో కులానికో కార్పొ రేషన్ మాదిరిగా ఉన్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో 100కు పైగానే కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్టు సమాచారం. అడిగిన వారికి కాదనకుండా ఏదో పదవి ఇచ్చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ ఇదే విధానం అవలంభించే అవ కాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సామాజికవర్గాల్లో ఏదో పదవితో న్యాయం చేయాలనే ఆలోచన ఉన్నట్టు సమాచారం. దీంతో గతంలో మాదిరిగా ఒకటి రెండు వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉండకపోవచ్చు. పదవుల్లో పార్టీల పరంగా, సామాజికవర్గాలు, పనితీరు, మహిళలు, యువత, దివ్యాంగ, తదితర వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు పార్టీలకు ప్రాధాన్యత ఉండేటట్టు ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో టీడీపీ ఎమ్మెల్యే ఉన్నారు. కాబట్టి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిని జనసేనకు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్టు ఆయా పార్టీవర్గాల కథనం. ఎమ్మెల్యే ఒక పార్టీకి చెందిన వారైతే అక్కడ మునిసిపల్ ఛైర్మన్ పదవులు వేరే పార్టీకి వచ్చే అవకాశం ఉంది. స్థానిక సంస్థల్లో జడ్పీ ఛైర్మన్ల పదవులను ఇదే విధంగా పంచే అవకాశం ఉంది. జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొ రేషన్, నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీలు ఉన్నాయి. పట్టణాల్లో రెండు చోట్ల టీడీపీ ఉండగా ఒక చోట మాత్రమే జనసేన ఉంది.అధిష్ఠానం ఆలోచన ఇలా ఉంటే..ఏదో విధంగా పదవి పొందాలని ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల సిఫారసు లతో వచ్చే పదవులు ఉంటాయి. అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు ఉంటాయి.ఈ పరిస్థితుల్లో ఆశావహుల్లో సందడి మొదలైంది.కొందరు ఇప్పటికే తమకు పదవులు వచ్చినట్టు.. హామీ ఇచ్చినట్టు ప్రచారం చేసుకోవడం గమనార్హం.

ఈ నెలలోనే పదవులు..

ఆగస్టులో ఈపదవుల పందేరం ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికి సుమారు 50 రోజులే అయింది.గత ప్రభుత్వం నాశనం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో ఉన్నారు. పార్టీ శ్రేణులకు గుర్తింపు ఉండాలి కాబట్టి నామినేటెడ్ పదవుల పందేరం త్వరలో ఉంటుంది. కూటమి అఖండ విజయంతో గత వైసీపీ పాలనలో ఇబ్బందులు పడి, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నేతలు నామినేటెడ్ పదవుల కు ఎదురు చూస్తున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వల్ల ఎమ్మెల్యే సీట్లు కోల్పోయిన నేతలు గతంలో అధిష్ఠానం ఇచ్చి న హామీ అమలుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వరద తగ్గింది.. నష్టం తేలింది!

14,599.05 హెక్టార్లలో నీట మునిగిన వరి


శాంతించిననది : పెరవలి మండలం తీపర్రు వద్ద లాగేసిన గోదావరి

- వివరాలు 7లో

- సాధారణ స్థాయికి గోదావరి వరద
- 14 మండలాల్లో ప్రభావం
- 1550 హెక్టార్ల ఉద్యాన పంటకు లాస్
- త్వరలో పునరావాస కేంద్రాలు ఎత్తివేత
- ఊపిరి పీల్చుకున్న రైతాంగం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. భద్రాచలంతో పాటు ధవళేశ్వరం వద్ద కూడా గోదావరి శాంతించింది. రెండు వారాలకు పైగా గోదావరి పెరుగుతూ తగ్గుతూ దోబూచులా డింది. దీంతో ఏక్షణాల ఏ ప్రమాదం ముంచుకొస్తుందో నని ప్రజలు భయపడ్డారు. అయితే ఎటువంటి ప్రమాదం లేకుండా గోదావరి తగ్గుముఖం పట్టడంతో గోదావరి పరీవాహక రైతాంగం ఊపిరిపీల్చుకున్నారు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను వెనక్కి తీసుకున్నారు. ప్రమాద స్థాయికి తగ్గి వరద ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బ్యారేజి నీటిమట్టం 10.60 అడుగులకు తగ్గింది. బ్యారేజీ నుంచి 8,50,203 క్యూసెక్కులు వరద దిగువకు పోతోంది. ఇది గంటగంటకూ తగ్గుతూ ఉంది. భద్రాచలం వద్ద సాయంత్రం 6 గంటలకు 34.30 అడుగులకు నీటి మట్టం తగ్గింది.ఇలాగే కొనసాగితే ఆదివారం నాటికి సాధారణ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. .ఇప్పటివరకూ బ్యారేజి నుంచి సముద్రంలోకి 1480 టీఎంసీల వరద నీరు కలిసిపోయింది. అయితే వేలాది హెక్టార్లలో పంటకు మాత్రం నష్టం జరిగింది. జిల్లాలో ఇంత వరకూ నష్టాన్ని ప్రాథమికంగానే అంచనా వేశారు. ఈ నెల 4వ తేదీ నుంచి నష్ట అంచ నాలకు టీమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలోని 14 మండలాల పరిధిలో 177 గ్రామాలకు చెందిన 4496 మంది రైతులకు సంబంధించిన 14,599 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలో వరి 66,550 హెక్టార్లలో సాగు చేయగా 14,599.05 హెక్టార్లలో పంట నీట మునిగింది. ఎర్ర కాలువ, బురదకాలువ, కొవ్వాడ కాలువల ప్రభావం తీవ్రంగా ఉంది. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, గోకవరం మండలాల్లో ముంపులేనట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఉద్యాన వన పంటలకు సంబంధించి జిల్లాలో మొత్తం 1543.79 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. 2811 మంది రైతులు నష్టపోయారు. మొత్తం 90 గ్రామాల్లో నష్టం జరిగింది. అందులో 1810 మంది రైతులకు చెందిన అరటి, బొప్పాయి, కూరగాయలు, పసుపు, బీటెల్‌వైన్, 24 మంది రైతులకు చెందిన 19.6 హెక్టార్లలో నర్సరీలు దెబ్బతిన్నాయి.117 ఇళ్లు మునిగిపోయాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌కు చెందిన వందలాది కిలోమీటర్ల రోడ్డు దెబ్బతిన్నాయి. మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకోవడంతో రేపోమాపో పునరావాసకేంద్రాలు ఎత్తివేసే అవకాశం ఉంది. విద్యుత్‌శాఖ నష్టాలు ఇంకా తేలవలసి ఉంది.

పింఛను..పంచెను

- రెండు రోజుల్లోనే 99.23 శాతం పంపిణీ
- 2,38,698 మందికి ఇంటి వద్దే అందజేత
- ఆలస్యంగా ఇచ్చిన 177 మందికి షోకాజ్
- గోకవరం ఎంపీడీవోపై కలెక్టర్ సీరియస్

రాజమహేంద్రవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్లు లేరు.. నాయకులూ లేరు.. రెండు రోజుల్లో నూరేశారు.. ఇంటింటికీ వెళ్లి మరీ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 99.23 శాతం పంపిణీ చేసేశారు. మొత్తం జిల్లాలో 2,40,595 మంది పింఛనుదారులు ఉండగా గురు, శుక్రవారాలు 2,38,698 మందికి అందించారు.ఇక కేవలం 1897 మంది మాత్రమే మిగిలారు. ఇందులో కొందరు దూర ప్రాంతాల్లో ఉండగా, కొందరు మృతి చెందినవారు ఉన్నట్టు చెబుతున్నారు. ప్రతి నెలా జిల్లాలో 800 నుంచి 900 మంది వరకూ వృద్ధాప్యంతో మృతిచెందుతున్నట్టు అధికారుల అంచనా. మొత్తం జిల్లాలో రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 విడుదల కాగా రూ.101 కోట్ల 75 లక్షల 84 వేల పంపిణీ చేయడం గమనార్హం. రాజమండ్రి రూరల్ మండలంలో అత్యధికంగా 99.16 శాతం కాగా 246 మందికి పెండింగ్ ఉంది. నిడదవోలు 99.28 శాతం పంపిణీ కాగా కేవలం 31మందికి పెండింగ్ ఉంది. సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు చాలెంజ్‌గా తీసుకుని పింఛన్లు పంపిణీ చేయడం పట్ల ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. ఉదయం గంటలకే పింఛన్ల పంపిణీ ఆరంభించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించినా కొందరు ఆలస్యంగా ప్రారంభించడంపై మండిపడ్డారు. మొదటి రోజు సాయంత్రం 4 గంటలకు 97 శాతం పంపిణీ ఎందుకు చేయించలేకపోయారని ప్రశ్నిస్తూ గోకవరం ఎంపీడీవోకి కలెక్టర్ ప్రశాంతి నోటీసు ఇచ్చినట్టు సమాచారం. అదే విధంగా కొవ్వూరు డివిజన్‌లోని 177 మంది పింఛన్ పంపిణీ అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఉదయం 7.15 గంటల వరకూ వీరెవరూ పంపిణీ ఆరంభించలేదు. నల్లజర్ల మండలంలో 48 మంది, దేవరపల్లి 40 మంది, తాళ్లపూడి 24 మంది, గోపాలపురం 18 మంది, నిడదవోలు 14 మంది, పెరవలి 10 మంది, నిడదవోలు అర్బన్ ఏడుగురు, కొవ్వూరు రూరల్ ఆరుగురు, చాగల్లు ఐదుగురు, కొవ్వూరు అర్బన్ ఐదుగురు ఉన్నారు. విధుల నిర్వహణ పట్ల బాధ్యతా రాహిత్యంగా ఉన్నారంటూ షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారి సంజాయషీని సంబంధిత ఎంపీడీవోలకు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం : డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 : పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో మంచిదన్నారు. జిల్లాలో 8వ తేదీ వరకూ నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ తల్లిపాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేసే పోస్టర్ ఆవిష్కరించారు. తల్లిపాలు సంపూర్ణ ఆహారమని, వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తి కూడా ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ షమ్మి కుమార్, డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, డాక్టర్ నిశాంత్, ఎంపీహెచ్‌ఈవో బాపిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గింపు ధరకు బియ్యం,కందిపప్పు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 : జిల్లా వ్యాప్తంగా 104 ప్రత్యేక కౌంటర్ల ద్వారా తగ్గింపు ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయాలు చేస్తున్నామని ఇన్‌ఛార్జి జేసీ, డీఆర్‌వో జి.నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మిల్లర్లతో సమీక్షించారు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.165లు ఉన్న కందిపప్పు (దేశవాళీ) రూ.150లకు, కిలో రూ.55లు ఉన్న బియ్యం (స్టీమ్) రూ.47లకు అందుబాటులోకి తీసుకువచ్చి విక్రయించడం జరుగుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు అందించాలనే ఉద్దేశ్యంతో రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 47, రాజమహేంద్రవరం రూరల్‌లో 21, గోకవరం 3, కోరుకొండ 4, అనపర్తి 5, కొవ్వూరు 2, నిడదవోలు 12, తాళ్లపూడి 2, నల్లజర్ల 2, ఉండ్రాజవరం 3, సీతానగరం, రాజానగరం, రంగంపేట, చాగల్లు, దేవరపల్లి, పెరవలి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలకు శిక్షణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీఈడీ/డీఈడీ, టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన గిరిజన యువత ఉపాధ్యాయ ఉద్యోగాలకు రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్.జ్యోతి తెలిపారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఏడు మండ లాల్లోని, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ,తూర్పుగోదావరి జిల్లాల్లోని యువత ప్రత్యేక శిక్షణకు ఈ నెల 3 నుంచి 9 వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.14న ఐటీడీఏ నోటీస్ బోర్డులో ఫైనల్ లిస్టు అందుబాటులో ఉంచుతారన్నారు. ఆగస్టు మూడో వారం నుంచి సుమారు 90 రోజుల పాటు 150 మందికి రంపచోడవరంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు.రంపచోడవరం ఐటీడీఏ ఈమెయిల్ ఐడీకి దరఖాస్తులు సమర్పించవచ్చని.. వివరాలకు 75690 98197 నెంబరులో సంప్రదించాలన్నారు.





కాకినాడ ఇంద్రపాలెంలో...

నీలి నీలి ఆకాశం

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం నీలి రంగులోకి మారి ప్రజలను కనువిందు చేసింది. ఈ దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.



రాజమహేంద్రవరం నాలుగో బ్రిడ్జి వద్ద...

రావి ఆకుపై పింగళి వెంకయ్య



గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 2: లీఫ్ కార్వింగ్ కళ ద్వారా జాతీయ పతాకం రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్రాన్ని రావి ఆకుపై చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి నూకాలమ్మ గుడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవింద రాజులు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నల్ల బల్లలపై వెంకయ్య చిత్రాన్ని గీయడంతో పాటు రావి ఆకుపై చిత్రించిన ఆయన చిత్రాన్ని చూపి జీవిత చరిత్రను వివరించారు. గోవిందరాజులును ఎంఈవోలు నాయుడు వెంకటేశ్వరరావు, జి.శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దర్శనాలు ప్రారంభం



మామిడికుదురు, ఆగస్టు 2: వరదల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో కొన్ని రోజులుగా నిలిపివేసిన బాలబాలాజీ స్వామి దర్శనాలను శుక్రవారం పునఃప్రారంభించారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకోవాలని సహాయ కమిషనరు జి.మాధవి కోరారు.

నేడు జీఎస్ఎల్‌లో ఐఎంఏ కాన్ఫరెన్స్

రాజానగరం, ఆగస్టు 2: జనరల్ ప్రాక్టీషనర్ల సేవలను బలోపేతం చేసే దిశగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో శనివారం జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 500 మంది జనరల్ మెడిసిన్ ఫిజీషియన్లు పాల్గొంటారని డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పీఎస్ శర్మ తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు కాన్ఫరెన్స్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేశ్ ప్రారంభిస్తారని ఐఎంఏ రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ డాక్టర్ వై.గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ విజయ భాస్కర్ తెలిపారు. ఐఎంఏ ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి విభాగాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పేపర్ ప్రజెంటేషన్లు, చర్చాగోష్ఠులు, కీలకోపన్యాసాలు ఉంటాయన్నారు. ఐఎంఏ డీన్ డాక్టర్ సత్యజిత్ బోరా, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వీఎస్‌వీఎల్ నరసింహం, డాక్టర్ బీసీ రాయ్ తదితర ప్రముఖులు పాల్గొంటారని డాక్టర్ సోమనాథ్ దాస్ వివరించారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన వారి నుంచి ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం దరఖాస్తులు కోరుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లకు సంబంధించి ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ (www.apprenticeshipindia.gov.in)లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు 10వ తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఆధార్, బయోడేటా, తపాలా చిరునామా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలవారు కుల ధ్రువీకరణపత్రం జతచేయాల్సి ఉందన్నారు. వచ్చిన దరఖాస్తులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఆగస్టు 27న విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో జరుగుతుందని పేర్కొన్నారు.

గోదావరి తగ్గినది

- సాధారణ స్థాయికి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ధవళేశ్వరం, ఆగస్టు 2: గత రెండు వారాలుగా ఉరకలేసి ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గి 9.86లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో 11 రోజులుగా కొనసాగిన మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై నీటిమట్టం రాత్రి 7గంటలకు 10.50అడుగులకు తగ్గింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 8,37,740 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో అన్నిచోట్లా నీటిమట్టం తగ్గుముఖం పట్టి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయి. భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 34.10 అడుగులుగా నమోదైంది.

1,481 టీఎంసీలు సముద్రం పాలు

వరదల సీజను మొదలై ఇప్పటివరకు అంటే జూన్ నెల నుం చి శుక్రవారం వరకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 1481.79 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి ప్రవహించింది. ఏప్రిల్‌లో గోదావరిలో లభించిన నీరు కేవలం 2టీఎంసీలు మాత్రమే. గోదావరికి వరద ప్రవాహం వచ్చి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా 10లక్షల క్యూసెక్కులు ప్రవహించడంతో జూలై 22న మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ప్రవాహం మరింత పెరగడంతో 23న రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై వరద ప్రవాహం తగ్గడంతో 25న రెండో ప్రమాదహెచ్చరికను ఉపసంహరించగా నీటిమట్టం 13.75 అడుగులకు పెరగడంతో 27న రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 15.80 అడుగులకు చేరుకోగా 16లక్షల క్యూసెక్కులు పైగా సముద్రంలోకి ప్రవహించింది. నీటిమట్టం తగ్గడంతో 30న రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై గోదావరి తగ్గుతూ, పెరుగుతూ, నిలకడగా కొనసాగడంతో మూడు రోజుల పాటు మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగింది. ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. 11రోజుల వ్యవధిలో 1207 టీఎంసీల వరద నీటిని సముద్రం లోకి వదిలారు. ఈ నీటితో మూడు డెల్టాల పరిధిలో ఏటా రెండు పంటలకు 10లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించవచ్చు.



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

పోశమ్మగండి వద్ద తగ్గిన ఉధృతి

దేవీపట్నం, ఆగస్టు 2: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నదులు పొంగి ప్రవహించి గోదావరిలో కలిసాయి. దీంతో మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. రెండు రోజులుగా వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం శుక్రవారం వరద నీటి నుంచి బయటపడింది. గోదావరి వరద ఉధృతి తగ్గుతుండడంతో పలు వాగులు నిలకడగా ప్రవహిస్తున్నాయి.



దుర్గాడ శివాలయంలో వైభవంగా శత రుద్రయాగం

రామలింగేశ్వర స్వామికి శాకంబరీ అలంకారం





గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 2: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో వేంచేసియున్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి శుక్రవారం శతరుద్రయాగం వైభవంగా జరిగింది. మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో స్వామికి శాకంబరీ అలంకారం చేశారు. గీతా వెంకటేశ్వర స్మార్త యాజుష ఆగమ పాఠశాల స్మార్త విద్యార్థులతో ఘంటసాల సోమేశ్వరశర్మ బ్రహ్మత్వంలో మహాగణపతి, పుణ్యాహవచనం, మండపారాధన, సూర్యనమస్కారాలు, శాంతి కల్యాణం, మహారుద్ర హోమం, సౌర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు స్వామికి సప్త హారతులు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏలూరు రేంజ్ పరిధిలో సీఐలకు స్థానచలనం

ఏలూరు క్రైం, ఆగస్టు 2: ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న సీఐలలో 41 మందిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా, డాక్టరు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలో పని చేస్తున్న 41 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వివిధ కారణాల వల్ల ఇద్దరు సీఐల బదిలీలు నిలిపివేసినట్లు సమాచారం. పోలవరం సీఐగా పనిచేస్తున్న మధుబాబు, గన్నవరం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న పెద్దిరాజుల బదిలీలను నిలిపివేస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అలాగే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి చేసిన కొందరిని ప్రభుత్వం వీఆర్‌కు పంపింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఆర్.అంకబాబు	వీఆర్ కాకినాడ	సామర్లకోట యూపీఎస్
డి.సురేష్	సామర్లకోట యూపీఎస్	(వీఆర్)ఏలూరు రేంజ్
టి.క్రాంతికుమార్	జీలుగుమిల్లి సర్కిల్	పెద్దాపురం సర్కిల్
వై.రవికుమార్	పెద్దాపురం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.చెన్నకేశవరావు	వీఆర్ ఏలూరు రేంజ్	తుని రూరల్ సర్కిల్
ఎస్‌వీవీఎస్ మూర్తి	తుని రూరల్ సర్కిల్	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.మోహన్‌కుమార్	వీఆర్ ఏలూరు రేంజ్	ముమ్మడివరం సర్కిల్
ఎన్.కొండయ్య	ముమ్మడివరం సర్కిల్	తణుకు టౌన్ పీఎస్
సీహెచ్ విద్యాసాగర్	ఇనగుదురు(కృష్ణా)	రావులపాలెం సర్కిల్
ఎం.రాంకుమార్	రావులపాలెం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
పి.విశ్వం	దిశా పోలీస్‌స్టేషన్ ఏలూరు	కొవ్వూరు టౌన్ యూపీఎస్
వి.జగదీశ్వరరావు	కొవ్వూరు టౌన్ యూపీఎస్	ఆకివీడు సర్కిల్
కె.రజనీకుమార్	సీసీఎస్-2 తూర్పుగోదావరి	పాలకొల్లు టౌన్ యూపీఎస్
కె.మంగాదేవి	పాలకొల్లు టౌన్ యూపీఎస్	అలాట్‌ టు తూర్పుగోదావరి
బి.ఎస్.చైతన్యకృష్ణ	కాకినాడ ట్రాఫిక్- 2 పీఎస్	కాకినాడ రూరల్ సర్కిల్
ఎ.శ్రీనివాస్	కాకినాడ రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
బొక్కా పెద్దిరాజు	వీఆర్, ఏలూరు రేంజ్	సర్పవరం పీఎస్
వై.ఆర్.కె.శ్రీనివాస్	సర్పవరం పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.మధుబాబు	పోలవరం సర్కిల్	రాజమహేంద్రవరం త్రీటౌన్
వీరయ్యగౌడ్	రాజమహేంద్రవరం త్రీటౌన్	(వీఆర్) ఏలూరు రేంజ్
కె.విజయబాబు	టీసీఎస్-1 రాజమహేంద్రవరం	కొవ్వూరు రూరల్ సర్కిల్
పి.శ్రీనివాసరావు	కొవ్వూరు రూరల్ సర్కిల్	(వీఆర్)ఏలూరు రేంజ్

ధృక్ సిద్ధాంత ప్రామాణికంగా నిర్దేశించి పండుగలను గుర్తించాలి

బ్రాహ్మణ పంచాంగకర్తల సంఘం డిమాండ్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 2: ధృక్ సిద్ధాంత ప్రామాణికంగా నిర్దేశించిన పండుగలను మాత్రమే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ధృక్ సిద్ధాంత పంచాంగకర్తల సమాఖ్య డిమాండ్ చేసింది. శుక్రవారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలోని బ్రాహ్మణ భవనలో సంఘ కార్యదర్శి పొన్నలూరి శ్రీనివాస గార్గేయ అధ్యక్షతన పంచాంగకర్తలతో సదస్సు నిర్వహించారు. గార్గేయ సిద్ధాంతి, గొర్తి పట్టాభిశాస్త్రి, తెలంగాణ పంచాంగకర్తల అధ్యక్షుడు అవసరాల ప్రకాశ్‌శర్మ మాట్లాడుతూ... పూర్వ పద్ధతి గణన ముమ్మాటికీ తప్పేనని, దీనివల్ల పండుగ నిర్ణయాలపై ప్రజల్లో అయోమయం, గందరగోళం నెలకొందన్నారు. ధృక్ గణిత పంచాంగం ఆధారంగా పండుగలు నిర్ణయించి ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. టీటీడీ తమిళ పంచాంగాన్ని ధృక్ సిద్ధాంతం ఆధారంగా ప్రచురిస్తున్నారని, తెలుగు పంచాంగాన్ని మాత్రం పూర్వ పద్ధతిలో నిర్ణయించడంతో అపోహలు వీడట్లేదన్నారు. ఒక్క శృంగేరి పీఠం తప్ప, కంచి కామకోటి పీఠంతో సహా దేశంలోని అన్ని పీఠాలు ధృక్ సిద్ధాంతాన్ని ఆమోదించాయన్నారు. సమావేశానికి హాజరైన 36 మంది పంచాంగకర్తలు పలు ... ఆదిత్య, నాగార్జున ఆదిత్య, నిట్టల వెంకటశివరామకృష్ణ, ఎక్కిరాల రామకృష్ణ, పి.రవి శంకర్, పి.చంద్రశేఖర్, నిర్మలానంద స్వామి, కారుపర్తి నాగేమల్లేశ్వర సిద్ధాంతి, దేవరబొట్ల భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పంచాంగకర్తల ప్రతినిధులు



సతీష్‌కు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్య శర్మ

పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలి

రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జోస్యుల సుబ్రహ్మణ్య శర్మ

కడియం, ఆగస్టు 2: పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య కోరింది. తూర్పు గోదావరి జిల్లా వేమగిరిలోని పార్వతీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య మొదటి సమావేశం జిల్లా గౌరవాధ్యక్షుడు జోస్యుల సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన జరిగింది. తొలుత సంఘం యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితుడైన కొత్తూరి సతీష్‌తో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ ఆలయాల్లో పౌరోహిత్యం చేసే పురోహితులను ప్రభుత్వం గుర్తించి, వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన వేదపండితులు, పురోహితులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అర్చకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అందుకు ఓ కమిషన్ వేయాలన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆలయాల కమిటీల్లో పురోహితులకు సభ్యుడిగా స్థానం కల్పించాలన్నారు. బ్రాహ్మణులు అపరకర్మలు నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఓ భవనం నిర్మించాలన్నారు. వేద విద్యను అభ్యసించే నిరుద్యోగులకు యువగళం పథకంలో రూ.3 వేలు భృతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మర్ల సీతారామశాస్త్రి, గోవిందవఝుల సుబ్రహ్మణ్యశర్మ, కొత్తూరి సతీష్, ఎ.సురేంద్రబాబు, కడియం గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేదాంతం నాని, పున్నమిరాజు వీర్రాజు, ఎస్‌వీఎల్ నరసింహారావు, కేవీ సుబ్బారావు, పాలగుమ్మి శేషగిరిరావు, బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వైద్య సేవల నిర్లక్ష్యంపై సీఎంకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2: రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపించినవైద్యురాలు, ఇతర వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రిలకు ఫిర్యాదు చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరుకు చెందిన ఖండవల్లి భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 31న భరత్‌కుమార్ తన కుమారుడు లీలా శ్రీకర్‌తో కలసి రాజమహేంద్రవరం సమీపంలోని డాక్టర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీకి స్పాట్ అడ్మిషన్లకు వస్తుండగా రాజవోలు దాటిన తర్వాత వారి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో లీలా శ్రీకర్‌కు కుడిచెయ్యి విరిగింది. గాయాలతోనే కాలేజీకి చేరుకుని స్పాట్ అడ్మిషన్ పూర్తిచేసుకున్న తర్వాత చికిత్స కోసం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వెళ్లారు. ఎమర్జన్సీ ఓపీ తీసుకుని ఆ సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యురాలి వద్దకు వెళితే చాలాసేపు బయటే నిలిపివేసి వైద్య సేవలు అందించడంతో నిర్లక్ష్యం చూపారన్నారు. తన కుమారునికి చెయ్యి విరిగిందని అనుమానంగా ఉందని ఎక్స్‌రే రాయాలని కోరితే చీటీ రాసిచ్చారని, ఎక్స్‌రే తీసిన తర్వాత ఆర్థోపెడిక్ డాక్టర్ గది వద్దకు వెళితే అక్కడ ఎవరూ లేరని భరత్‌కుమార్ ఆరోపించారు. దీంతో తనకు భయం వేసి రాజమహేంద్రవరం నుంచి కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని భరత్‌కుమార్ కోరారు.



నాటుసారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు, ఎస్ఈబీ అధికారులు

రూ.14.50 లక్షలు విలువైన నాటుసారా, మద్యం సీసాలు ధ్వంసం

పెద్దాపురం, ఆగస్టు 2: కాకినాడ జిల్లా పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన నాటుసారా, మద్యం సీసాలను పోలీసు, ఎస్ఈబీ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. స్థానిక పోలీస్ క్వార్టర్ వద్ద ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దొర, డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో 287 కేసుల్లో పట్టుబడిన రూ.14,50,947 విలువైన నాటుసారా, మద్యం సీసాలను ధ్వంసం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాటుసారా తయారీ కేంద్రాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని, సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతున్నట్టు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సామర్లకోట, జగ్గంపేట సీఐలు అంకబాబు, లక్ష్మణరావు, ఎస్ఐలు వెలుగుల సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

5న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 2: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 5న కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కెలచ్చారావు తెలిపారు. ఎస్‌డీవీఎల్ సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్‌లో సర్వే ఇంజనీర్, డిజైనింగ్ ఇంజనీర్ అండ్ సైట్ ఇంజనీర్, శ్రీరామ్ కాంటాక్ట్ సెంటర్లో కస్టమర్ రిలేషన్ ఆఫీసర్, టెలికాలింగ్ ఎగ్జిక్యూటివ్ అండ్ డేటా సోర్స్ ఎగ్జిక్యూటివ్ డిక్సాన్, హోండాయ్ మోబీస్ అండ్ రాక్‌మెన్ ఇండస్ట్రీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు .12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయి. ఆసక్తి గల వారుసోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 ను సంప్రదించాలన్నారు.



మోటారు సైకిలును ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు



గోకవరం, ఆగస్టు 2: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం వెంకటాపురం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... దేవీపట్నం మండలం ఇందుకూరుపేట నుంచి తుర్రం సురేష్, అతని భార్య భవాని, కుమారుడు హేమంత్ కుమార్‌దొర మోటార్ సైకిలుపై రంపచోడవరం మండలం కె.ఎర్రంపాలెం (అత్తగారుఇంటికి) బయల్దేరారు. మండలంలోని వెంకటాపురం వెళ్లేసరికి రంపచోడవరం వైపు నుంచి గోకవరం వైపు వస్తున్న కారు వీరి మోటారు సైకిలును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సురేష్, భవాని, కుమార్‌దొర తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ కార్యాలయం కూల్చివేతకు..

రాజమహేంద్రవరం కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వైసీపీ కార్యాలయం కూల్చివేతకు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన తుది ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. పార్టీ కార్యాలయ నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, బిల్డింగ్ ప్లాన్ వివరాలను జతచేస్తూ భవన నిర్మాణ అనుమతి రెన్యువల్ కోసం అధికారులకు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్లకు సూచించింది. అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాల విషయంలో జూలై 4న ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలకు, చట్టనిబంధనలకు లోబడి ఆ దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ప్రత్యక్షంగా హాజరై వాదనలు వినిపించేందుకు పిటిషనర్లకు అవకాశం ఇవ్వాలని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులు అందిన తర్వాత రెండు నెలల్లో దరఖాస్తు పరిష్కరించాలని స్పష్టం చేసింది. భవన నిర్మాణ అనుమతుల రెన్యువల్ కోసం ప్రత్యక్షంగా దరఖాస్తు సమర్పించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. దానిపై తుది నిర్ణయం వెల్లడించేంతవరకు వైసీపీ కార్యాలయ భవనం విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది. నిర్మాణాలు కొనసాగించవద్దని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పాముకాటుతో కౌలు రైతు మృతి

పిఠాపురం రూరల్, ఆగస్టు 2: పాముకాటుకు గురయి కౌలురైతు మరణించిన సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కౌలు రైతు కొమ్ము నాగేశ్వరరావు(58) పొలం పనులకు వెళ్లి గడ్డి కోస్తున్నాడు. అక్కడ పాము కాటుకు గురయ్యాడు. ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ జిల్లా కమిటీ మాజీ సభ్యుడు కొమ్ము చినబాబుకు సోదరుడు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

ఐటీడీఏ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత కోచింగ్

● పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 2: ఏజెన్సీలోని గిరిజన యువతీ, యువకులకు డీఎస్సీ ప్రత్యేక శిక్షణఇస్తామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన చాంబరులో మాట్లాడుతూ డిగ్రీతోపాటు బీఈడీ, ఇంటర్‌తో పాటు డీఎడ్, టెట్ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు స్థానిక యువ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. ఏదైనా స్క్రీనింగ్ టెస్ట్ పాసైన వారు డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు ఈనెల మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐటీడీఏ కార్యాలయ నోటీసు బోర్డులో ఆగస్టు 14న ఫైనల్ లిస్ట్ పొందుపరుస్తామన్నారు. దరఖాస్తులను dsccoachingitdarcvm@gmail.com వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని,వివరాలకు 7569098197 లో సంప్రదించాలన్నారు.

వృత్తి పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తే గుర్తింపు

● పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టరు సూరజ్ గనోరే



సూరజ్ గనోరేను సత్కరిస్తున్న ఉద్యోగులు

రంపచోడవరం, జూలై 2: వృత్తి పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని బదిలీపై వెళ్తున్న పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టరు సూరజ్ గనోరే అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో ఆయన్ను గజమాలతో ఘన ంగా సన్మానించారు. ఈ సందర్భంగా గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు సేవ చేయడం అదృష్టంగా భావించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేయడం ద్వారానే తనకు గుర్తింపు వచ్చిందన్నారు. మారుమూల గ్రామాల్లో రహదారులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, తాగునీరు, సెల్ టవర్ల ఏర్పాటుకు కృషి చేశానన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కె.సింహాచలం, సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ జగదీష్, ఏపీవో (జీ)సీహెచ్ శ్రీనివాసరావు, పరిపాలనాధికాకారి డీఎస్పీ రమణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గేటు దాటని ర్యాలీ



ఐసీడీఎస్ కార్యాలయ గేటు లోపల ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి ఆగస్టు 2: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను గిరిజన ప్రాంతంలో అధికారులు నీరుగారుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో తొలిరోజునే మం డల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్లు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టేవారు. ఈ ఏడాది కొందరు అం గన్వాడీ వర్కర్లను ఐసీడీఎస్ కార్యాలయానికి పిలిచి అక్కడే వారితో ఫొటో దిగి ర్యాలీ చేసినట్టుగా అధికారులు సామాజిక మాధ్యమాల్లో పెట్టుకోవడంపై ప్రజాప్రతినిధులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సీడీపీవో దేవమణిని వివరణకోరగా కొందరు అంగన్వాడీ వర్కర్లను ఐసీడీఎస్ కార్యాలయా నికి పిలిచి వారోత్సవాలు ఎలా నిర్వాహించాలనే దానిపై అవగాహన కల్పించామన్నారు. కార్యాలయం బయటే నినాదాలు చేశామని చెప్పారు.

వరలక్ష్మి కానుక రిజిస్ట్రేషన్ ప్రారంభం

దేవీపట్నం, ఆగస్టు 2: మండలంలోని ఇందుకూరుపేటలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వరలక్ష్మి కానుక రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ ప్రక్రియ 5వ తేదీ వరకు జరుగుతుందని కమిటీ తెలిపింది. అనంతరం డ్రా తీసి గెలిచిన వారికి బంగారు రూపులు ఇస్తామని చెప్పారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మోతుగూడెం, ఆగస్టు 2: మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీ తులసిపాక గ్రామంలో శుక్రవారం వీఆర్వో సరోజిని, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఏరువాడ, మిట్టవాడ, లక్కగూడెం, చదలవాడ, ఎర్రగొండపాకల, చౌలూరు, కన్నులూరు గ్రామాల గిరిజనులకు జీసీసీ డిపోలో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కందిపప్పు, కిలో మంచినూనె, కిలో బంగాళాదుంపలు, కిలో ఉల్లిపాయలు ఉచితంగా అందజేశారు. సర్పంచ్ సవలం నరేష్, ఎంపీటీసీ కనుములరమణ, జనసేన మండల కార్యదర్శి కట్టం ముత్తయ్య, బీజేపీ మండల కార్యదర్శి కె.మల్లేష్, సీపీఎం నేత మడివి నాగేష్, డీలర్ నరేంద్ర పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అందజేత

ఎటపాక: గోదావరి వరద ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు శుక్రవారం వరద సాయంను అందించారు. గన్నవరం ప్రదాన రహదారి వెంబడి నివసిస్తున్న 42 మంది మత్స్యకార కుటుంబాల వారికి సాయం ను అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.3వేల చొప్పున నగదుతో పాటు బియ్యం అందించారు. సర్పంచ్ గడ్డంభద్రమ్మ, ఎంపీటీసీ కంటే రాజు, టీడీపీ నాయకుడు దానేరాజు నగదును అందజేశారు. గ్రామ సెక్రటరీ స్వాతీదేవీ, తదితరులు పాల్గొన్నారు.

వరద సాయం అందించాలంటూ మహిళల దీక్ష

ఎటపాక, ఆగస్టు 2: గోదావరి వరద సాయం రూ.3వేలను తమకు అందించాలంటూ గన్నవరం, కాపుగొంపల్లి గ్రామాల మహిళలు సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఉప సర్పంచ్ కందుకూరి శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి వరదకు గ్రామం చుట్టూ నీరు చేరడంతో బయటకు రాలేకపోతున్నామన్నారు. వరదలు, వర్షాలతో నెల రోజులుగా ఉపాధిలేక ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నామని, ప్రభుత్వం సాయం చేయాలన్నారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దారు పృథ్వి శిబిరం వద్దకు వచ్చి దీక్ష విరమించాలని కోరారు. వరద సాయం అందిస్తేనే దీక్ష విరమిస్తామని మహిళలు చెప్పారు. ఈ విషయాన్ని జేసీ దృష్టికి తీసుకెళ్తానని డీటీ హామీ ఇచ్చారు.

చంద్రబాబు, మందా కృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం



చంద్రబాబు, మంద కృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం దృశ్యం

ఎటపాక, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ అమలుకు దేశ అత్యున్నత న్యాయస్థానంలో అనుకూలమైన తీర్పు వెలువడిన నేపథ్యంలో శుక్రవారం గన్నవరం గ్రామంలో మాదిగలు సీఎం చంద్రబాబు, మందా కృష్ణమాదిగ, ఉప ముఖ్యమంత్రి పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఏసుపాక వెంకట్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమంను నిర్వహించారు. మాదిగల దశాబ్దాల పోరాటాలకు సుప్రీం కోర్టులో తీర్పురావడం హర్షనీయమన్నారు. సీఎం చంద్రబాబు గతంలో చేసిన వర్గీకరణ చట్టంను సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందన్నారు. తీర్పును వెంటనే అమలు చేయాలని కోరారు. సర్పంచ్‌గడ్డం భద్రమ్మ, ఏసుపాక నర్సింహారావు (పెదబాబు), కొప్పుల ప్రవీణ్, ఎం ,అశోక్, బాలాజీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

మారేడుమిల్లి, ఆగస్టు 2: ఇటీవల కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలకు ఇల్లు కోల్పోయిన కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని చావడికోట పంచాయితీ బొడ్డుమామిడి విధి గ్రామానికి చెందిన గిరిజనుడి ఇల్లు పడిపోయింది. సర్పంచ్ సాదల ప్రేమకుమార్‌రెడ్డి, పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, బొడ్డేటి వీరబాబు తమ వంతు సాయంగా 50 కేజీల బియ్యం, వంట సామాగ్రి, కూరగాయలు బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పల్లాల లక్ష్మిభూపతిరెడ్డి, దూడ సుందర్‌పాల్ పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి'

రంపచోడవరం, ఆగస్టు3: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జ్యుడిషియల్ కోర్టు జడ్జి పి.బాబు అన్నారు. స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉత్వర్వుల ప్రకారంశుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.కృష్ణపవన్, న్యాయవాదులు, కోర్టు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి, కొత్తచట్టాలపై విద్యార్థులకు అవగాహన

మోతుగూడెం, ఆగస్టు 2: ఎస్పీ అమిత్‌బర్దర్, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్‌ల ఆదేశాల మేరకు డొంకరాయి ఎస్ఐ శివకుమార్ గ్రామంలో ఉన్న జడ్పీ హైస్కూల్, గిరిజన బాలికల ఉన్నత పాఠశాలల్లో గంజాయి, కొత్త చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు.

కనకదుర్గమ్మకు సారె

రంపచోడవరం, ఆగస్టు 2: స్థానిక సంతమార్కెట్ వీధిలో కొలువైన శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా భక్తులు సారె సమర్పించారు. విశ్వ హిందూ పరిషత్ మండల ప్రముఖ్ (ప్రభారి) నల్లమిల్లి వెంకటరామారెడ్డి, అధ్యక్షుడు పింజర్ల నాగవీరభద్రరావు, జిల్లా కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణకిషోర్, వెలిశెట్టి వీరభద్రరావు, గుడ్ల అంకశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అగ్రికల్చరల్ స్టాటస్టికల్ సర్వేపై శిక్షణ

రాజమహేంద్రవరంరూరల్ ఆగస్టు 2: పంటకోత అంచనా సర్వే, వ్యవసాయ గణన పరీక్షల కోసం ముందస్తు అవగాహన అంశాలపై జిల్లాలోని రెవెన్యూశాఖలోగల జూనియర్ అసిస్టెంట్‌లకు, గేడ్-1గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీవో అప్పలకొండ తెలిపారు. జిల్లాకలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మొదటిరోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 8వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణలో సర్వే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెలుగువారిఖ్యాతిని దేశానికి చాటిన పింగళి వెంకయ్య

● నన్నయ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు

● పింగళి వెంకయ్య జయంతి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 2: తెలుగువారి ఖ్యాతిని దేశానికి చాటిచెప్పిన మహనీయుడు పింగళి వెంకయ్య అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. జాతీయపతాక రూపకర్త పింగళివెంకయ్య జయంతి కార్యక్రమాన్ని నన్నయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఇన్‌ఛార్జి వీసీ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత పింగళివెంకయ్య చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ వెంకయ్యవంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని విశ్వవిద్యాలయంలోని సిబ్బంది తమ విధులను త్రికరణ శుద్ధిగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాలలో భారత దేశ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పింగళి చిత్రపటానికి హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు ఈశ్వరరెడ్డి, లక్ష్మణరెడ్డి, అప్పారావు, వలీషా, శిరీష, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సీనియర్ సిటిజన్స్ డేకేర్ భవనంలో పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహంతి లక్ష్మణరావు, జి.వరప్రసాదరావు, కాసాని శంకరరావు, బండి నరేంద్ర, మారిశెట్టి సత్యనారాయణ, మురపాక వీర్రాజు, పడాల అప్పారావు, కొల్లేపర బుల్లయ్య పాల్గొన్నారు.

ఆక్రమణలు కట్టడి చేయాలి

● సమావేశంలో కమిషనర్ కేతన్ గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2: రాజమహేంద్రవరంలో ఆక్రమణలను కట్టడి చేయాలని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాలులో టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన స్థలాలను కాపాడాలని, ఆయా స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా కట్టడి చేయాలన్నారు. నగరంలో ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని, వాటి రికార్డులను సిద్ధంచేసుకోవాలన్నారు. రోడ్ల విస్తరణకు ప్రణాళికను తయారు చేయాలని, విస్తరణకు అడ్డువచ్చే అనధికార నిర్మాణాలను గుర్తించాలన్నారు. అనేకచోట్ల ఫుట్‌పాత్‌లు, కాలువలపై ఇనుప వ్యర్థాలు వేసి ఉండటాన్ని గమనించామని వాటిని వెంటనే తొలగించాలని, అన్ని కాలువల్లో డీసిల్టేషన్ చేయాలని ఎంహెచ్‌వోను ఆదేశించారు. వీధి వ్యాపారులను నియంత్రించడానికి వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా సమస్యలకు సంబంధించిన ఫొటోలు తీసుకోవాలని, అవసరమైన చోట వీడియోలు తీసుకోవాలన్నారు. నగరాన్ని పోస్టర్ ఫ్రీ సిటీగా ప్రకటించినా అక్కడక్కడా పోస్టర్లు అంటిస్తున్నారని, వాటిని తొలగించడంతో పాటు జరిమానాలు విధించాలని ఆదేశించారు. డ్రైనేజీ ఆక్రమణలను ముందే గుర్తించి భవనాల యజమానులను హెచ్చరించాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ డీవీఎస్ఎన్ మూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలి

కార్పొరేషన్ ప్రధాన మంచినీటి విభాగాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ కేతన్‌గార్గ్ తనిఖీ చేశారు. క్లోరినేషన్ ప్రక్రియ, పటిక కలపడం వంటి వాటిని పరిశీలించారు. నగర ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ గోదావరి వరదల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకుని తగు మోతాదుల్లో క్లోరిన్, పటిక కలుపుతున్నారని తెలిపారు. నీటి నాణ్యతను పరిశీలించడానికి ఎమినిటీస్ కార్యదర్శులు, ఫిట్టర్లకు కిట్లు ఇస్తున్నామని, రోజూ వార్డుల్లో పైపులైను చివరి పాయింట్ల వద్ద నీటి నాణ్యత పరిశీలిస్తున్నామన్నారు. హెడ్ వాటర్ వర్కుల్లో నీటినాణ్యతను పరిశీలించిన తర్వాతే పంపింగ్ చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీ పాండురంగారావు, ఈఈలు మదర్సా ఆలీ, చంద్రశేఖర్, ఈ ప్రసాద్, అసిస్టెంటు ఇంజనీరు శ్రీధర్ పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంతో సత్ఫలితాలు'



ప్రగడ రాంబాబు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాజానగరం, ఆగస్టు 2: దేశప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. రాజానగరం మండలం కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలోని ప్రకృతి వ్యవసాయ ప్రదర్శనా క్షేత్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కేవీకే, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రదర్శనా క్షేత్రాల వివరాలను కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు అధికారులకు వివరించారు. వివిధ పద్ధతుల్లో నాటిన వరిసాగు, సంవత్సరం పొడవునా కూరగాయలు అందించే ఏటీఎం(ఎనీ టైం మనీ) మోడల్ విధానాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి బి.తాతారావు, సహాయ అధికారి వలి వివరించారు. అనంతరం రాజానగరం మండలంలోని నందరాడ, నరేంద్రపురం గ్రామాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులు ప్రగడ రాంబాబు, గుత్తుల సత్యనారా యణలను ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న రైజింగ్ హేండ్స్ సంస్థ

● నిరుపేద మహిళ మృతదేహానికి ఉచిత అంబులెన్స్ సేవలు



మహిళ మృతదేహాన్ని ఉచిత అంబులెన్స్‌లో తరలిస్తున్న బంధువులు

అనపర్తి, ఆగస్టు 2: కూలీ నాలీ చేసుకుంటూ చెట్ల కింద నివాసం ఉంటున్న నిరుపేద మహిళ అనారోగ్యంతో మృతి చెందడంతో మృతదేహాన్ని తరలించేందుకు వారి వద్ద డబ్బులు లేకపోవడంతో రైజింగ్ హేండ్స్ సంస్థ ఉచిత అంబులెన్సును ఏర్పాటుచేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల ప్రకారం బిక్కవోలుకు చెందిన కొన్ని కుటుంబాలు కెనాల్ రోడ్డువద్ద చెట్లకింద జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఒక మహిళ గురువారంరాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని వారి స్వగ్రామమైన బిక్కవోలుకు తరలించేందుకు డబ్బులులేక దీనంగా ఉన్న కుటుంబాలను చూసి పొలమూరు గ్రామానికి చెందిన దొంతంశెట్టి వనుములు రైజింగ్ హేండ్స్ ఫర్ హోప్ సంస్థకు సమాచారం అందించారు. వెంటనే సంస్థ అధ్యక్షుడు నల్లమిల్లి ఆదిరెడ్డి వారి ఆధీనంలో నడుస్తున్న సత్యసాయి ఉచిత అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామమైన బిక్కవోలు తీసుకువెళ్లి అంత్యక్రియలు చేసుకున్నారు.

'రంపలో టీడీపీ జెండా ఎగరడం సంతోషకరం'

కడియం, ఆగస్టు 2: గత కొన్నేళ్లుగా ఏనాడూ లేనివిధంగా టీడీపీ జెండా ఎగరడం ఎంతో సంతోషకరమని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, టీడీపీ నాయకుడు మహ్మద్ జమాల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం వేమగిరిలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి, రంపచోడవరం నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్ స్వగృహానికి జమాల్‌ఖాన్ విచ్చేశారు. కొద్దిసేపు టీడీపీ నాయకులతో ముచ్చటించారు. చెల్లుబోయిన శ్రీనువాసు, టీడీపీ నాయకులు జమాల్‌ఖాన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జోగి చక్రవర్తి, గుత్తుల శేషగిరి, జోగి గోవిందు, జోగి వెంకటేశ్వరరావు ఉన్నారు.

రాజానగరంలో రెండు దుకాణాల్లో చోరీ

రాజానగరం, ఆగస్టు 2: రాజానగరంలోని నూకాలమ్మ ఆలయ సమీపంలో రెండు వేర్వేరు దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి నగదును అపహరించారు. స్థానిక ఫ్లిప్ కార్ట్ కార్యాలయం షట్టర్ తాళాలు పగులగొట్టి షాపులో భద్రపర్చిన రూ.1.20లక్షలు నగదును అపహరించారు. అలాగే దీనికి సమీపంలోని గౌరవ ఎలక్ట్రికల్స్ దుకాణం షట్టర్ తాళాలు ధ్వంసంచేసి సుమారు రూ.25వేలు నగదును అపహరించినట్లు యజమానులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో రాత్రి సమసయాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేయాలని, ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారన్నారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీం సందర్శించి ఆధారాలను సేకరిస్తున్నారు. రాజానగరం ఎస్ఐ పవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజల అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం'

కోరుకొండ, ఆగస్టు 2: రాష్ట్రంలోని ప్రజల అవసరాలను తీర్చడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గత ఎన్నికల్లో ప్రజలు కష్టపడి, దగ్గరుండి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని వారికి సేవ చేయడం మా బాధ్యత అని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఎంతో కాలంగా ప్రజలు కోరుకుంటున్న కోరుకొండ నుంచి బూరుగుపూడి, గుమ్ముళ్ళూరు, బుచ్చింపేట, ఉండేశ్వరపురం, మిర్తిపాడు, తొర్రేడు మీదుగా రాజమహేంద్రవరం చేరుకుని నూతన ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం కోరుకొండ ఆర్టీసీ బస్సుస్టేషన్ నుంచి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకటలక్ష్మిలు నూతన బస్సు సర్వీసు ప్రారంభించారు. అదే బస్సులో ఎమ్మెల్యే దంపతులు, ఇతర అధికారులు, నాయకులు బస్సులో ప్రయాణం చేశారు.

ఇద్దరు క్షతగాత్రులను కాపాడిన ఎమ్మెల్యే బత్తుల

● హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు

కోరుకొండ, ఆగస్టు2: రాజమహేంద్రవరం కోరుకొండ మధ్యగల కొంతమూరువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అటుగా వెళుతున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆగి ధైర్యం చెప్పారు. కోరుకొండ మండలం కోటి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను కొంతమూరువద్ద గుర్తు తెలియని వాహనం శుక్రవారం సాయంత్రం వేగంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. రోడ్డు ప్రక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఇద్దరు క్షతగాత్రులను చూసి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కాన్వాయ్ ఆపి వారికి ధైర్యం చెప్పారు. వెంటనే 108ను రప్పించి క్షతగాత్రులను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లకు ఫోన్‌చేసి తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.

ముగ్గురిలో లెప్రసీ వ్యాధి గుర్తింపు

సీతానగరం, ఆగస్టు 2 :మండలంలో ముగ్గురికి లెప్రసీ వ్యాధి గుర్తించినట్లు పేరా మెడికల్ ఆఫీసర్ వీర్రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలో లెప్రసీ కేస్ డివెక్షన్ క్యాంపెయిన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జూలై 18 నుంచి శుక్రవారం వరకు జరిగిన క్యాంపెయిన్‌లో 80,783 మందిని సర్వే చేయగా వారిలో 166 మందిని అనుమానితులుగా గుర్తించామని వారికి వైద్య పరీక్షలు జరపగా వారిలో ముగ్గురికి లెప్రసీ వ్యాధి నిర్ధారణ అయిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి చైతన్య, వైద్యుడు ఎన్.రాజు, ఎంపీహెచ్‌ఈవో సుబ్బారాయుడు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

పురాతన ఆలయాల అభివృద్ధికి మంత్రి హామీ

బిక్కవోలు, ఆగస్టు 2: నియోజకవర్గంలోని ఏడు అతి పురాతనమైన దేవాలయాల అభివృద్ధికి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. బిక్కవోలులో 11వ శతాబ్దంలో తూర్పు చాళుక్యులచే నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయం అతి పురాతనమైనదని ఈ ఆలయానికి గ్రామస్థులు 60 సెంట్ల భూమిని సేకరించి ఇస్తే ఆలయ పునఃనిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారన్నారు. కొంకుదురులోని వీరేశ్వర, సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ముఖమండప నిర్మాణానికి రూ.60లక్షలు, పెదపూడి మండలంలోని పుట్టగొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముఖమండప నిర్మాణానికి రూ.60 లక్షలు, పైన లోని వీరభద్రేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ. కోటి, రంగంపేట మండలంలోని వడిశలేరులోని భజేనారాయణస్వామి ఆలయంలో రాజగోపురం, ధ్వజస్తంభ నిర్మాణానికి రూ.60 లక్షలు, ఉమారామలింగేశ్వర, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల పునఃనిర్మాణానికి రూ.2కోట్లు, అనపర్తి మండలంలోని రామవరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరుచేయాలని మంత్రిని కోరామన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష

కడియం, ఆగస్టు 2: తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకవల్లి అన్నారు. తల్లి పాల వారోత్సవా సందర్భంగా పొట్టిలంకలో సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో కనకవల్లి మాట్లాడుతూ తల్లి ముర్రుపాలు మొదటి టీకాగా పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కలిదిండి విశాలాక్షి, కార్యదర్శి తాతారావు, జీఎంఎస్ కే రేష్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్ విజయకుమారి, చాంద్‌బీబీ, వెంకటలక్ష్మి, ధనలక్ష్మి, విజయలక్ష్మీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

రంగంపేట : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని రంగంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రంగంపేట పీహెచ్‌సీ, చంద్రేడు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహించారు.

● చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, శానిటేషన్, స్కూల్ పరిసరాలు పరిశీలించి తగుసూచనలు ఇచ్చారు.పీహెచ్‌ఎన్‌ఎల్.గంగభవానీ,ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నారు.

శాకాంబరిగా శ్రీదేవి అమ్మవారు

కడియం, ఆగస్టు 2: కడియం దేవీచౌక్ సెంటర్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారు శుక్రవారం శాకాంబరిగా దర్శనం ఇచ్చారు. కడియం కూరగాయల వ్యాపారి దొడ్డా బుజ్జితోపాటు కూరగాయల వ్యాపారులు సమకూర్చిన రెండుటన్నుల కూరగాయలు, పండ్లతో అమ్మవారి విగ్రహాన్ని, ఆలయాన్ని సుం దరంగా తీర్చిదిద్దారు.

'డైట్ కళాశాల అధ్యాపకుడు, పీఈటీలను అరెస్టు చేయాలి'

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో విద్యార్థినులపట్ల అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావులను అరెస్టు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ విజృంభణ) డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరంలో శుక్రవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ పలువురు విద్యార్థినులు కలిసి నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైట్ కళాశాలలో సెక్యూరిటీగార్డ్ లేరని, వాచ్‌మెన్ లేరని, విద్యార్థినులకు భద్రత లేదన్నారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు అరకొరగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులు భరించలేక వారికి వారే ఫిర్యాదు చేసుకుంటేనే విషయం బయటకు వచ్చిందని కళాశాలలో పర్యవేక్షణ లేదని ఈ కళాశాలలో జరిగిన దారుణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, కేవలం సస్పెండ్ చేసి వదిలి పెడితే ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతాయని, అందువల్ల వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సౌత్ జోన్ పరిధిలో సెక్షన్ 30 అమలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈనెల 1 నుంచి 31 వరకూ పోలీస్ యాక్టు సెక్షన్ 30 అమల్లోకి తెచ్చామని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ శుక్రవారం రాత్రి తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి నిర్వహించడానికి వీల్లేదన్నారు. అయితే.. ఈ సెక్షన్‌ని సౌత్‌జోన్‌లో అమలు చేయడానికి స్పష్టమైన కారణాలను వివరించకపోవడం గమనార్హం. శాంతి భద్రతల పరిరక్షణకు అని పేర్కొన్న డీఎస్పీ.. విఘాతానికి ఎలాంటి పరిస్థితులను పోలీసులు గమనించారో తెలియజేయలేదు. గతంలో కూడా ఈ సెక్షన్‌ని ఈ జోన్ పరిధిలోనే ఎక్కువగా ప్రయోగించడం తెలిసిందే.

నేడు మాలల అత్యవసర సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2: ఐక్యంగా ఉన్న జాతిని విడదీసే కుట్ర చేసిన ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ ఈ నెల 3న శనివారం రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి మాలలు తరలిరావాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి ఆయన ఓ వీడియో విడుదల చేశారు. సుప్రీం కోర్టు తీర్పుపై వ్యాజ్యం వేసేందుకు, గల్లీ నుంచి ఢిల్లీ వరకు మాలల ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు పలు అంశాలపై కులంకషంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు మాలలు, మాల సంఘాల నాయకులు, మాలమహానాడు నాయకులు, ఉద్యోగులు, కార్మికుల, ఈ సమావేశానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్, సీటు బెల్టు ధరించడంతోపాటు రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై ఆర్టీసీ బస్టాండ్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటించడం సామాజిక బాధ్యతగా గుర్తెరగాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు చెప్పాలన్నారు. వారిని గమనిస్తూ ఉండాలన్నారు. ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తే వారి తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. రెప్పపాటు నిర్లక్ష్యం కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందని హితవు పలికారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పిల్లలకు వాహనాలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మన భద్రత మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని మరిపోకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిలా అశోక్, డిపో మేనేజర్ షేక్ షబ్బం తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగ స్టు 2: భారత ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరింత చేరువయ్యే దిశగా, 4జీ సర్వీసులు ప్రారంభించిన సందర్భం గా శుక్రవారం సీనియర్ అధికారులు, ఉద్యోగులు ప్లకార్డులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రిన్సిప ల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు, రాజశేఖర్ బాబు, నాగరాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, పీఆర్వో వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్లకు ఎమ్మార్పీఎస్ సత్కారం



ఎమ్మెల్యే గోరంట్లను గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2: ఎమ్మార్పీఎస్ కోస్తా రీజనల్ కన్వీనర్ ముమ్మిడివరకు చిన సుబ్బారావు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంరూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని గజ మాలతో ఘనంగా సత్కరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై ఆనందం వ్యక్తం చేస్తూ గతంలో వర్గీకరణకు మద్దతుగా మాట్లాడిన ఎమ్మెల్యే గోరంట్లను రాజమహేంద్రవరంలోని ఆయన నివాసంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ సమాజంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉపయోగించుకోలేక అనేక వర్గాలు వెనుకబడి పోతున్నారన్నారు. అనంతరం ముమ్మిడివరకు చినసుబ్బారావు మాట్లాడుతూ అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టించి తీర్మానంచేసి రాష్ట్రంలో మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ యార్లగడ్డ శేఖర్ పాల్గొన్నారు.

'చిరకాల పోరాటానికి ఫలితం దక్కింది'

గోకవరం, ఆగస్టు2: సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగల చిరకాల పోరాటానికి తగిన ఫలితం దక్కిందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాలూరి బోస్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శుక్రవారం గోకవరంలో ఎంఎస్పీ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. ఈసందర్భంగా ఠాణా సెంటర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంఎస్పీ సంఘం సభ్యులతో కలిసి బోస్ పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మం డలంలోని పలు గ్రామాలకు చెందిన మాదిగలు పాల్గొన్నారు.

వేమగిరిలో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

కడియం, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ సమంజసం అంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందాకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుముచ్చి యేసేబు, తాతపూడి వెంకటేష్, కొల్లి ఏసు, ఈతకోట రాజ్‌కుమార్, దొండపాటి ఏసు, ఇండిగమిల్లి పోతియ్య తదితరులు పాల్గొన్నారు.

నరసింహం సేవలు అభినందనీయం : డీఎల్‌డీవో



జూనియర్ అసిస్టెంట్ నరసింహంను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంరూరల్, ఆగస్టు2: నిబద్ధత, అంకితభావంతో పని చేసే ప్రతీ ఉద్యోగికి ప్రజలు, అధికారుల నుంచి తగిన గుర్తింపు వస్తుందని, అందుకు ఎంపీడీవో కా ర్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన ఏఎల్ నరసింహం ఉదాహరణ అని డీఎల్‌డీవో వీణాదేవి, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నరసింహం పదవీ విరమణ పురస్కరించుకుని సత్కారసభ ఘనంగా జరిగింది. నరసింహం దంపతులకు దుశ్శాలువావేసి పూలమాలతో సత్కరించారు. ఏవో, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

భీష్మ వశిష్ట అవార్డుకు వినురెడ్డి ఎంపిక




అనపర్తి, ఆగస్టు 3: వందే భారత్ సంస్థ వివిధ రంగాలలో సేవ లందించే వారికి ప్రతియేటా అందజేస్తున్న భీష్మ వశిష్ట అవార్డుకు సోషల్ మీడియా ద్వారా సేవలందిస్తున్న అనపర్తికి చెందిన నల్లమిల్లి వినురెడ్డి ఎంపికయ్యారు. శనివారం కాకినాడలోని కుసుమ సత్యఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వినురెడ్డిని ఈ అవార్డుతో సత్కరించనున్నారు. ఈ సందర్భంగా వినురెడ్డిని పలువురు ప్రముఖులు అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి-అనపర్తి రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని జీఆర్పీ సీఐ విజయ్‌శంకర్ తెలిపారు. మృతుడికి సుమారు 50ఏళ్ల వయసు ఉంటుందన్నారు. అతడి వివరాలు తెలిసిన వారు 94406 27551, 94914 44022కి సమాచారం ఇవ్వాలని అయన కోరారు.

వరినాట్లలో నిమగ్నం

మోతుగూడెం, ఆగస్టు 2: మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీలో గిరిజన రైతులు వరినాట్ల పనిలో నిమగ్నమయ్యారు. ఎత్తైన ప్రాంతాల్లో వరి పొలాలు సాగు చేయడంవల్ల నారుమడుల పొలాలు కోతకు గురికాలేదన్నారు. వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు ఎప్పటికప్పుడు దిగిపోవడంతో వరి సాగుకు ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదని రైతులు చెబుతున్నారు.



సెప్టెంబరులో ముహూర్తాల్లేవ్..

ఆదివారం నుంచి శుభముహూర్తాలు ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబరు నెలలో భాద్రపద మాసంలో మాత్రం ముహూర్తాలు లేవు. తిరిగి ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో అంటే అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో ముహూర్తాలు ఉన్నాయి.. తల్లిదండ్రులు కంగారుపడకుండా పెళ్లిళ్లు చేసుకోవచ్చు.. ఒక నెలలో మాత్రమే ముహూర్తాల్లేవ్..

- కారుపర్తి నాగమల్లేశ్వర సిద్ధాంతి, శుభతిథి గంటల పంచాంగకర్త, పుల్లేటికుర్రు

పెళ్లి కళ వచ్చేసిందే బాలా..

ఈ నెల 7 నుంచే మోగనుంది పెళ్లిబాజా

- ఈ నెలలో 12 రోజులు మంచి ముహూర్తాలు
- మూడు నెలల తర్వాత శుభఘడియలు
- ఏర్పాట్లలో తల్లిదండ్రులు



కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం/మండపేట : మోగనుంది పెళ్లి బాజా. మూఢం.. శూన్యమాసం.. కారణంగా మార్చి నెల నుంచి ముహూర్తాలు లేవు.. అందరూ మంచిరోజులకు ఎదురుచూస్తున్నారు. మూడు నెలల విరామం తర్వాత ముహూర్తాలు భారీగా ఉండడంతో పెళ్లి సందడి నెలకొంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మళ్లీ పెళ్లి బాజాలు భారీగా మోగ నున్నాయి. భారీ ఎత్తున పెళ్లిళ్లు చేయడానికి వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. నగలు, వస్త్రాలు, కల్యాణ మండపాలు, సన్నాయి, కేటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలో నగలు, వస్త్ర దుకాణాల్లో అప్పుడే షాపింగ్ కళ పెరిగిపోయింది. బంగారం ధర కాస్త తగ్గడంతో ఇదే మంచి సమయంగా కోట్లలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

మరో రెండు రోజుల్లోనే శ్రావణం..

ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. ఈ నెల 7 నుంచి భారీగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో మొత్తం 14 రోజులు వివాహాలకు శుభ ఘడియలుగా పండితులు చెబుతున్నారు. దీంతో ఎక్కడికక్కడ పెద్దఎత్తున ముహూర్తాలు ఖరారయ్యాయి. ముఖ్యంగా ఈనెల 18, 22, 23 తేదీల్లో అయితే ఉమ్మడి జిల్లాలో వేలల్లో పెళ్లిళ్లు ఉన్నాయి. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు 26 వేలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో ఆభరణాలు, వస్త్రాలు, డెకరేషన్, మండపాలు, సన్నాయి, కేటరింగ్ కలిపి మొత్తం రూ.520 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు జరగవచ్చని వర్తక సంఘాలు విశ్లేషిస్తున్నాయి.

మంచి ముహూర్తాలు ఇవే..

ప్రధానంగా ఈ నెలలో 7, 8, 9, 10, 13, 15, 17, 18, 19, 22, 23, 24 తేదీలు వివాహాలకు అత్యంత అనుకూలమని పంచాంగకర్తలు ప్రకటించారు. వీటిలో అత్యంత బలమైన ముహూర్తాలుగా 17, 18, 22, 23 తేదీలను పేర్కొన్నారు. దీంతో ఆయా తేదీల్లో కల్యాణ మండపాలకు యమ డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపం దొరకడం గగనమైపోతోంది. అసలు వర్షాకాలం కావడంతో కల్యాణ మండపం తప్పనిసరిగా మారింది. ఇక కొంత మంది తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లల వివాహాలు దైవ సన్నిధిలో చేసుకుంటే వారి వైవాహిక జీవితం కష్టాలు లేకుండా సాగుతుందని భావిస్తుంటారు. ఆనవాయితీగా కూడా అలా చేస్తారు. రాష్ట్రంలో తిరుపతి తర్వాత అన్నవరం, ద్వారకాతిరుమలలో అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతంటాయి. అన్నవరంలో ఏడాదికి 8 నుంచి 10 వేల జంటలు సత్యదేవుడి సాక్షిగా ఒక్కటవుతుంటాయి. శ్రావణమాసం నేపథ్యంలో సత్యదేవుడి సన్నిధిలో వివాహ మండపాలన్నీ బుకింగ్ జరిగిపోయాయి. బలమైన ముహూర్తాలున్న నాలుగు రోజుల్లో అయితే కొండపై వెయ్యికిపైగా వివాహాలు జరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్నవరం కొండపై సత్రం గదులకు సైతం భారీ డిమాండ్ నెలకొంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు భారీగా రావడంతో గదుల కేటాయింపుపై ఏంచేయాలో తెలీక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఖర్చు రూ.కోట్లలో..

కాకినాడ జిల్లావ్యాప్తంగా పల్లెలు, పట్టణాలన్నీ కలిపి 10 వేలకు పైగా వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రాజమహేంద్రవరం జిల్లా 7 వేలు, కోనసీమ జిల్లావ్యాప్తంగా 9 వేలకుపైగా పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. సరాసరి ఒక్కో వివాహానికి కనీసం రెండు లక్షలు ఖర్చు చేసినా రూ.520 కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మూడునెలలుగా గిరాకీ లేని పూల డెకరేషన్, బంగారం దుకాణాలు, క్యాటరింగ్, పురోహితులు, సన్నాయి, ఈవెంట్ ఆర్గనైజింగ్ తదితర రంగాల వ్యాపారం భారీగా పుంజుకోనుంది. ఇప్పటికే ఏ బంగారం దుకాణం చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఆభరణాల కొనుగోళ్లే రూ.150 కోట్లు దాటిపోతాయని అంచనా. పురోహితులు, మంగళ వాయిద్యకారులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.

సందడే సందడి..

పెళ్లి అనే రెండక్షరాల బంధం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమైంది. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆచితూచి శుభఘడియలను ఎంచుకుని ముడేస్తారు. తద్వారా వారి వివాహ బంధం జీవితకాలం ఎలాంటి ఆటుపోట్లకు లోనవకుండా ఉండాలని కోరుకుంటుంటారు. ఈ వివాహాలకు ఏప్రిల్ తర్వాత మూడు నెలల విరామం వచ్చింది. రెండు నెలల మూఢం, మరో నెల శూన్య మాసం రావడంతో మంచి ముహూర్తాలే లేవు. దీంతో వివాహాలన్నీ వాయిదా పడ్డాయి. ఇప్పుడు శ్రావణమాసం ప్రారంభం అవు తుండడంతో మూడు నెలల తర్వాత తిరిగి పెళ్లి కళ వచ్చేసింది. వివాహాలకు శ్రావణం శుభకరమని పండితులు చెబుతారు. ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కాగా 7 నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయి. దీంతో వేలాది మంది పెళ్లి ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్నారు. వచ్చేవి మంచిరోజులు కావడంతో గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. ఈనెల తప్పితే మళ్లీ భాద్రపదం శూన్యమాసం కావడం సెప్టెంబరులో వివాహ ముహూర్తాలు లేవు. ఈనెల శ్రావణం శుభకరంగా భావించి పెద్ద ఎత్తున వివాహాలకు నవ జంటలు సిద్ధమవుతున్నాయి.

నేడు ఎంపీ పురందేశ్వరి రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 : ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులు పరిశీలిస్తారు. విజయవాడ నుంచి ఉదయం 11 గంటలకు దేవరపల్లి మండలం గౌరీపట్నం చేరుకుని వరద ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తారు. రైతులు, అధికారులతో మాట్లాడి వరద నష్టం వివరాలను తెలుసుకుంటారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ఢిల్లీ నుంచి వచ్చే రైల్వే అధికారులతో, రైల్వే డీఆర్ఎం టీంతో కలసి రైల్వే సంబంధిత అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. సాయంత్రం విజయవాడ చేరుకుని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళతారు.



రౌడీ షీటర్లపై నిఘా పెట్టాలి : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. కొత్త చట్టాల గురించి వివరించారు. ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ భౌగోళిక పరిధి, నేరాల తీరును ఎస్పీకి డీఎస్పీ అంబికా ప్రసాద్ వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ వి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం సీఐ వినయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చక్రద్వారబంధం పంచాయతీ కార్యదర్శిపై డీపీవో ఆగ్రహం

రాజానగరం, ఆగస్టు 2 : మండలంలో చక్రద్వారబంధం పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు వ్యవహార శైలిపై డీపీవో దాసరి రాంబాబు మండిపడ్డారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదంటూ అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం డీపీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని ఎస్సీ ఏరియాతో పాటు పలు కూడళ్లలో నెలకొన్న అపారిశుధ్యంపై మండిపడ్డారు. తాగునీటిని స్వయంగా పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి చేరుకుని రికార్డులు నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై మండిపడ్డారు. గ్రామంలోని దుకాణదారులకు నోటీసులు జారీ చేయాలని గతంలో ఆదేశించినప్పటికీ కార్యదర్శి ఖాతరు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

ఇద్దరు సీఐలకు నో పోస్టింగ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ ఎస్పీ నరసింహ కిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీతో అంటకాగిన సీఐలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌కి పంపించారు.ఏలూరు దిశ పీఎస్ సీఐ పి.విశ్వం కొవ్వూరు టౌన్‌కి అక్కడ పనిచేస్తున్న వి.జగదీశ్వరరావును ఆకివీడుకు పంపించారు. రాజమహేంద్రవరం సీసీఎస్-2 సీఐ కె.రజనీ కుమార్‌ను పాలకొల్లు టౌన్‌కి పంపించి అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కె.మంగాదేవిని తూర్పుగోదావరికి కేటాయించారు. పోలవరం సీఐ జి.మధుబాబును రాజమహేంద్రవరం త్రీటౌన్‌కి బదిలీ చేసి ప్రస్తుతం ఇక్కడ ఉన్న ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్‌ని వీఆర్‌కి పంపారు. కొవ్వూరు రూరల్ సీఐ పెద్దిబోయిన శ్రీనివాసరావును వీఆర్‌కి పంపుతూ ఆ స్థానాన్ని రాజమహేంద్రవరం సీసీఎస్-1 సీఐ కె.విజయ్ బాబుతో భర్తీ చేశారు. వీరిలో మధుబాబు గతంలో కూడా త్రీటౌన్‌లో పని చేయగా, మంగాదేవి ధవళేశ్వరం సీఐగా విధులు నిర్వర్తించారు.

పదవులెవరికో!



మాకు పదవులు ఎప్పుడొస్తాయో.. ఎప్పుడిస్తారోనంటూ నాయకులు ఎదురుచూపులు చూస్తున్నారు.. కూటమి ప్రభుత్వం ఏర్పడడం.. మూడు పార్టీలు కలిసి ఉండడంతో ఎవరికి ఏ పదవి దక్కుతుందోననే అంచనాల్లో ఉన్నారు.. అయితే అధిష్ఠానం నాయకుల మధ్య వివాదాలకు తావు లేకుండా నియోజకవర్గాల్లో ఏ పార్టీకెంత అనే లెక్కలు తేల్చేసింది.. ఆ లెక్కన తమకు పదవులు కేటాయిస్తారని కూటమి నాయకులు ఆశగా ఉన్నారు..

నామినేటెడ్ పదవులకు ఎదురుచూపులు

- పోటీపడుతున్న నాయకులు
- ఎవరి ప్రయత్నాల్లో వారు
- ఎమ్మెల్యేల సిఫారసులకు డిమాండ్
- పార్టీల వారీగా శాతాలు
- టీడీపీ..60, జనసేన 30, బీజేపీ 10
- నియోజకవర్గాల వారీగా మార్పు
- ఆ లెక్కనే ఎంపిక చేయాలని నిర్ణయం
- ఆశావహుల్లో మొదలైన సందడి
- ఈ నెలలోనే ఎంపికకు సన్నాహాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎదురుచూపులు ఫలించే రోజు వచ్చింది.. రేపో మాపో నాయకులను నామినేటెడ్ పదవులు వరించనున్నాయి.. ఈ పదవుల విషయంలో కసరత్తు ఆరంభించినట్టు కొద్దిరోజుల కిందట సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రస్థాయిలో ఏ పార్టీకి ఎన్ని నామినేటెడ్ పదవులనే విషయంలో కూడా ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలుగుదేశం -జనసేన-బీజేపీ కూటమిలో నామినేటెడ్ పదవులపై ఆశలు రేకెత్తాయి.

పదవుల పంపకం ఇలా..

ఎన్నికల్లో కలిసి పోటీ చేసి ఘన విజయం సాధించి కూటమిలోని పార్టీలు..నామినేటెడ్ పదవులు ఒక పద్ధతి ప్రకారం తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చాయి. మొత్తం పదవుల్లో 60 శాతం టీడీపీ, 30 శాతం జనసేన, 10 శాతం బీజేపీ నేతలకు ఇచ్చేటట్టు మూడు పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రస్థాయి, జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవుల్లో కూడా ఇదే సూత్రాన్ని అమలు చేయనున్నారు.టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులకు 60 శాతం పదవులు వస్తాయి. జనసేనకు 30 శాతం, బీజేపీ 10 శాతం వస్తాయి. జనసేన ఎమ్మెల్యేలు ఉన్నచోట జనసేనకు 60 శాతం, 30 శాతం టీడీపీ, 10 శాతం బీజేపీకి వస్తాయి. బీజేపీ ఎమ్మెల్యే ఉన్నచోట బీజేపీకి 50 శాతం, టీడీపీ, జన సేనకు సగం సగం వస్తాయని చెబుతున్నారు.ఈ లెక్కన రాజమహేంద్రవరంసిటీ,రాజమండ్రి రూరల్, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో టీడీపీ క్యాడర్‌కు ఎక్కువ పదవులు లభిస్తాయి. నిడదవోలు, రాజానగరంలో జనసేనకు, అనపర్తిలో బీజేపీకి ఎక్కువ పదవులు వస్తాయి. రాష్ట్రస్థాయిలో కూడా నామినేటెడ్ పదవులు ఉంటాయి. ఎన్నికల్లో సీట్లు త్యాగం చేసిన పెద్దలకు ఎమ్మెల్సీ పదవులు, లేదా చైర్మన్ పదవులు వచ్చే అవకాశం ఉంది. మిగతా క్యాడర్‌లో వారు పార్టీకి పనిచేసిన విధానం, గత ప్రభుత్వంలో వైసీపీని వ్యతి రేకించి, పార్టీకి కట్టు బడి, పార్టీ కోసం ప్రజల కోసం నిలబడిన నేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. అంతే కాకుండా సామాజికవర్గం,మతం, ప్రాంతాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు.రాష్ట్ర స్థాయి చైర్మన్ పద వులు, టీడీడీ బోర్డు మెంబర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ చైర్మన్, డైరెక్టర్లు, ఆలయ ట్రస్టీలు, ఆర్టీసీ పద వులు, కార్పొరేషన్లకు చైర్మన్లు, ఏఎంసీలు, సొసైటీలు తదితర పదవులు ఉంటాయి. నియోజకవర్గానికి ఎలా లేదన్నా సుమారు 200లకు పైనే నామినేటెడ్ పదవులు ఉంటాయి. జిల్లా లెక్కన తీసుకుంటే సుమారు 2 వేలు పైనే ఉంటాయి.ఆయా పదవులకు తీవ్ర పోటీ ఉంటుంది. బీసీ సామాజిక వర్గాల్లో కులానికో కార్పొ రేషన్ మాదిరిగా ఉన్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో 100కు పైగానే కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్టు సమాచారం. అడిగిన వారికి కాదనకుండా ఏదో పదవి ఇచ్చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ ఇదే విధానం అవలంబించే అవ కాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సామాజికవర్గాల్లో ఏదో పదవితో న్యాయం చేయాలనే ఆలోచన ఉన్నట్టు సమాచారం. దీంతో గతంలో మాదిరిగా ఒకటి రెండు వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉండకపోవచ్చు. పదవుల్లో పార్టీల పరంగా, సామాజికవర్గాలు, పనితీరు, మహిళలు, యువత, దివ్యాంగ, తదితర వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు పార్టీలకు ప్రాధాన్యత ఉండేటట్టు ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ఉదాహరణకు రాజమహేంద్రవరంలో టీడీపీ ఎమ్మెల్యే ఉన్నారు. కాబట్టి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిని జనసేనకు ఇవ్వాలని ఆలోచిస్తున్నట్టు ఆయా పార్టీవర్గాల కథనం. ఎమ్మెల్యే ఒక పార్టీకి చెందిన వారైతే అక్కడ మునిసిపల్ చైర్మన్ పదవులు వేరే పార్టీకి వచ్చే అవకాశం ఉంది. స్థానిక సంస్థల్లో జడ్పీ చైర్మన్ల పదవులను ఇదే విధంగా పంచే అవకాశం ఉంది. జిల్లాలో రాజమహేంద్రవరం కార్పొ రేషన్, నిడదవోలు, కొవ్వూరు మునిసిపాలిటీలు ఉన్నాయి. పట్టణాల్లో రెండు చోట్ల టీడీపీ ఉండగా ఒక చోట మాత్రమే జనసేన ఉంది.అధిష్ఠానం ఆలోచన ఇలా ఉంటే..ఏదో విధంగా పదవి పొందాలని ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల సిఫారసు లతో వచ్చే పదవులు ఉంటాయి. అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు ఉంటాయి.ఈ పరిస్థితుల్లో ఆశావహుల్లో సందడి మొదలైంది.కొందరు ఇప్పటికే తమకు పదవులు వచ్చినట్టు.. హామీ ఇచ్చినట్టు ప్రచారం చేసుకోవడం గమనార్హం.

ఈ నెలలోనే పదవులు..

ఆగస్టులో ఈపదవుల పందేరం ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికి సుమారు 50 రోజులే అయింది.గత ప్రభుత్వం నాశనం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో ఉన్నారు. పార్టీ శ్రేణులకు గుర్తింపు ఉండాలి కాబట్టి నామినేటెడ్ పదవుల పందేరం త్వరలో ఉంటుంది. కూటమి అఖండ విజయంతో గత వైసీపీ పాలనలో ఇబ్బందులు పడి, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నేతలు నామినేటెడ్ పదవుల కు ఎదురు చూస్తున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వల్ల ఎమ్మెల్యే సీట్లు కోల్పోయిన నేతలు గతంలో అధిష్ఠానం ఇచ్చి న హామీ అమలుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వరద తగ్గింది.. నష్టం తేలింది!

14,599.05 హెక్టార్లలో నీట మునిగిన వరి


శాంతించినది : పెరవలి మండలం తీపర్రు వద్ద లాగేసిన గోదావరి

- వివరాలు 8లో

- సాధారణ స్థాయికి గోదావరి వరద
- 14 మండలాల్లో ప్రభావం
- 1550 హెక్టార్ల ఉద్యాన పంటకు లాస్
- త్వరలో పునరావాస కేంద్రాలు ఎత్తివేత
- ఊపిరి పీల్చుకున్న రైతాంగం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు, రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. భద్రాచలంతో పాటు ధవళేశ్వరం వద్ద కూడా గోదావరి శాంతించింది. రెండు వారాలకు పైగా గోదావరి పెరుగుతూ తగ్గుతూ దోబూచులా డింది. దీంతో ఏక్షణాల ఏ ప్రమాదం ముంచుకొస్తుందో నని ప్రజలు భయపడ్డారు. అయితే ఎటువంటి ప్రమాదం లేకుండా గోదావరి తగ్గుముఖం పట్టడంతో గోదావరి పరీవాహక రైతాంగం ఊపిరిపీల్చుకున్నారు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను వెనక్కి తీసుకున్నారు. ప్రమాద స్థాయికి తగ్గి వరద ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బ్యారేజి నీటిమట్టం 10.60 అడుగులకు తగ్గింది. బ్యారేజీ నుంచి 8,50,203 క్యూసెక్కులు వరద దిగువకు పోతోంది. ఇది గంటగంటకూ తగ్గుతూ ఉంది. భద్రాచలం వద్ద సాయంత్రం 6 గంటలకు 34.30 అడుగులకు నీటిమట్టం తగ్గింది.ఇలాగే కొనసాగితే ఆదివారం నాటికి సాధారణ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. .ఇప్పటివరకూ బ్యారేజి నుంచి సముద్రంలోకి 1480 టీఎంసీల వదర నీరు కలిసిపోయింది. అయితే వేలాది హెక్టార్లలో పంటకు మాత్రం నష్టం జరిగింది. జిల్లాలో ఇంత వరకూ నష్టాన్ని ప్రాథమికంగానే అంచనా వేశారు. ఈ నెల 4వ తేదీ నుంచి నష్ట అంచ నాలకు టీమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలోని 14 మండలాల పరిధిలో 177 గ్రామాలకు చెందిన 4496 మంది రైతులకు సంబంధించిన 14,599 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలో వరి 66,550 హెక్టార్లలో సాగు చేయగా 14,599.05 హెక్టార్లలో పంట నీట మునిగింది. ఎర్ర కాలువ, బురదకాలువ, కొవ్వాడ కాలువల ప్రభావం తీవ్రంగా ఉంది. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, గోకవరం మండలాల్లో ముంపులేనట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఉద్యాన వన పంటలకు సంబంధించి జిల్లాలో మొత్తం 1543.79 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. 2811 మంది రైతులు నష్టపోయారు. మొత్తం 90 గ్రామాల్లో నష్టం జరిగింది. అందులో 1810 మంది రైతులకు చెందిన అరటి, బొప్పాయి, కూరగాయలు, పసుపు, బీటెల్‌వైన్, 24 మంది రైతులకు చెందిన 19.6 హెక్టార్లలో నర్సరీలు దెబ్బతిన్నాయి.117 ఇళ్లు మునిగిపోయాయి. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌కు చెందిన వందలాది కిలోమీటర్ల రోడ్డు దెబ్బతిన్నాయి. మొదటి ప్రమాద హెచ్చరిక ఉససంహరించుకోవడంతో రేపోమాపో పునరావాసకేంద్రాలు ఎత్తివేసే అవకాశం ఉంది. విద్యుత్‌శాఖ నష్టాలు ఇంకా తేలవలసి ఉంది.

పింఛను..పంచెను

- రెండు రోజుల్లోనే 99.23 శాతం పంపిణీ
- 2,38,698 మందికి ఇంటి వద్దే అందజేత
- ఆలస్యంగా ఇచ్చిన 177 మందికి షోకాజ్
- గోకవరం ఎంపీడీవోపై కలెక్టర్ సీరియస్

రాజమహేంద్రవరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్లు లేరు.. నాయకులూ లేరు.. రెండు రోజుల్లో నూరేశారు.. ఇంటింటికీ వెళ్లి మరీ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 99.23 శాతం పంపిణీ చేసేశారు. మొత్తం జిల్లాలో 2,40,595 మంది పింఛనుదారులు ఉండగా గురు, శుక్రవారాలు 2,38,698 మందికి అందించారు.ఇక కేవలం 1897 మంది మాత్రమే మిగిలారు. ఇందులో కొందరు దూర ప్రాంతాల్లో ఉండగా, కొందరు మృతి చెందినవారు ఉన్నట్టు చెబుతున్నారు. ప్రతి నెలా జిల్లాలో 800 నుంచి 900 మంది వరకూ వృద్ధాప్యంతో మృతిచెందుతున్నట్టు అధికారుల అంచనా. మొత్తం జిల్లాలో రూ.102 కోట్ల 54 లక్షల 77 వేల 500 విడుదల కాగా రూ.101 కోట్ల 75 లక్షల 84 వేల పంపిణీ చేయడం గమనార్హం. రాజమండ్రి రూరల్ మండలంలో అత్యధికంగా 99.16 శాతం కాగా 246 మందికి పెండింగ్ ఉంది. నిడదవోలు 99.28 శాతం పంపిణీ కాగా కేవలం 31మందికి పెండింగ్ ఉంది. సచివాలయ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు చాలెంజ్‌గా తీసుకుని పింఛన్లు పంపిణీ చేయడం పట్ల ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. ఉదయం గంటలకే పింఛన్ల పంపిణీ ఆరంభించాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించినా కొందరు ఆలస్యంగా ప్రారంభించడంపై మండిపడ్డారు. మొదటి రోజు సాయంత్రం 4 గంటలకు 97 శాతం పంపిణీ ఎందుకు చేయించలేకపోయారని ప్రశ్నిస్తూ గోకవరం ఎంపీడీవోకి కలెక్టర్ ప్రశాంతి నోటీసు ఇచ్చినట్టు సమాచారం. అదే విధంగా కొవ్వూరు డివిజన్‌లోని 177 మంది పింఛన్ పంపిణీ అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఉదయం 7.15 గంటల వరకూ వీరెవరూ పంపిణీ ఆరంభించలేదు. నల్లజర్ల మండలంలో 48 మంది, దేవరపల్లి 40 మంది, తాళ్లపూడి 24 మంది, గోపాలపురం 18 మంది, నిడదవోలు 14 మంది, పెరవలి 10 మంది, నిడదవోలు అర్బన్ ఏడుగురు, కొవ్వూరు రూరల్ ఆరుగురు, చాగల్లు ఐదుగురు, కొవ్వూరు అర్బన్ ఐదుగురు ఉన్నారు. విధుల నిర్వహణ పట్ల బాధ్యతా రాహిత్యంగా ఉన్నారంటూ షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారి సంజాయషీని సంబంధిత ఎంపీడీవోలకు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం : డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 : పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో మంచిదన్నారు. జిల్లాలో 8వ తేదీ వరకూ నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాలపై వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ తల్లిపాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేసే పోస్టర్ ఆవిష్కరించారు. తల్లిపాలు సంపూర్ణ ఆహారమని, వీటిలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని, వ్యాధి నిరోధక శక్తి కూడా ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ షమ్మి కుమార్, డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, డాక్టర్ నిశాంత్, ఎంపీహెచ్‌ఈవో బాపిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గింపు ధరకు బియ్యం,కందిపప్పు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2 : జిల్లా వ్యాప్తంగా 104 ప్రత్యేక కౌంటర్ల ద్వారా తగ్గింపు ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయాలు చేస్తున్నామని ఇన్‌ఛార్జి జేసీ, డీఆర్‌వో జి.నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మిల్లర్లతో సమీక్షించారు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.165లు ఉన్న కందిపప్పు (దేశవాళీ) రూ.150లకు, కిలో రూ.55లు ఉన్న బియ్యం (స్టీమ్డ్) రూ.47లకు అందుబాటులోకి తీసుకువచ్చి విక్రయించడం జరుగుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు అందించాలనే ఉద్దేశ్యంతో రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో 47, రాజమహేంద్రవరం రూరల్‌లో 21, గోకవరం 3, కోరుకొండ 4, అనపర్తి 5, కొవ్వూరు 2, నిడదవోలు 12, తాళ్లపూడి 2, నల్లజర్ల 2, ఉండ్రాజవరం 3, సీతానగరం, రాజానగరం, రంగంపేట, చాగల్లు, దేవరపల్లి, పెరవలి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలకు శిక్షణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బీఈడీ/డీఈడీ, టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన గిరిజన యువత ఉపాధ్యాయ ఉద్యోగాలకు రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎస్.జ్యోతి తెలిపారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఏడు మండ లాల్లోని, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ,తూర్పుగోదావరి జిల్లాల్లోని యువత ప్రత్యేక శిక్షణకు ఈ నెల 3 నుంచి 9 వరకూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.14న ఐటీడీఏ నోటీస్ బోర్డులో ఫైనల్ లిస్టు అందుబాటులో ఉంచుతారన్నారు. ఆగస్టు మూడో వారం నుంచి సుమారు 90 రోజుల పాటు 150 మందికి రంపచోడవరంలోని యూత్ ట్రెయినింగ్ సెంటర్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు.రంపచోడవరం ఐటీడీఏ ఈమెయిల్ ఐడీకి దరఖాస్తులు సమర్పించవచ్చని.. వివరాలకు 75690 98197 నెంబరులో సంప్రదించాలన్నారు.

కొవ్వూరు పట్టణ సీఐగా విశ్వం

వీఆర్‌కు రూరల్ సీఐ.. విజయబాబు నియామకం


పి.విశ్వం


కె.విజయబాబు

కొవ్వూరు, ఆగస్టు 2: కొవ్వూరు పట్టణ సీఐగా పనిచేస్తున్న వి.జగదీశ్వరరావు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు సీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు జిల్లా దిశ పోలీ స్టేషన్ సీఐగా చేస్తున్న పి.విశ్వం నియమితులయ్యారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అలాగే కొవ్వూరు రూరల్ సీఐగా చేస్తున్న పెద్దిబోయిన శ్రీనివాసరావును వీఆర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొంటూ ఆయన స్థానంలో రాజమహేంద్రవరం సీసీఎస్-1 సీఐ కె.విజయబాబును నియమించారు.

ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గం

చాగల్లు, ఆగస్టు 2: శ్రీవాసవి ఆర్యవైశ్య మహిళా మండలి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రాజకీయంగా చురుకుగా ముందుకు సాగాలని సమావేశంలో తీర్మానించారు. అధ్యక్షురాలిగా కొల్లేపర మహలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పెంజర్ల విజయలక్ష్మి, గ్రంధి పార్వతి, కార్యదర్శిగా వెత్సా జ్యోతి, సహాయ కార్యదర్శిగా కోరంగి శ్యామల, సబ్బిశెట్టి లక్ష్మి, కోశాధికారిగా తీగల శ్రీదేవి, జాయింట్ కోశాధికారులుగా కోరంగి సునీత, మట్టే శుభశ్రీ, మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 2: కూటమి ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరులో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేర్చడం టీడీపీతోనే సాధ్యమన్నారు. హౌస్ ఫర్ ఆల్ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు భూమి అందజేయనుందన్నారు. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని వారికి సాయం చేయనుందన్నారు. పేద, మధ్య తరగతి వారికి రూ.4 లక్షలు ఇంటి నిర్మాణానికి అందజేస్తుందన్నారు. అలాగే జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వనుందన్నారు. కేంద్ర పథకాలను వినియోగించి రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులను దశల వారీగా పూర్తి చేస్తామన్నారు.

వాసవీ మాతకు ఆషాఢం సారె



చాగల్లు, ఆగస్టు 2: ఆషాఢమాసం ముగింపు సందర్భంగా భక్తులు అమ్మవార్లకు సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక శ్రీపార్వతి సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి, అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. చండీ హోమం నిర్వహించారు. గ్రామ మహిళలు అమ్మవారికి ఆషాఢమాసం సారె తీసుకొచ్చి పలురకాల స్వీట్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే స్థానిక వాసవీ కన్యక పరమేశ్వరికి ఆర్యవైశ్య మహిళలు వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లతో నిండిన కావిళ్లతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కొల్లేపర మహలక్ష్మి, గ్రంధి పార్వతి మాణిక్యం, వెత్సా సత్యవాణి పాల్గొన్నారు.

ఇద్దరి నేత్రాలు దానం



కొమ్మిరెడ్డి కొండయ్య

తాళ్లపూడి /గోపాలపురం, ఆగస్టు 2: తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో మద్దుకూరి భూలక్ష్మి (95) గతంలో తన నేత్రాలను దానం చేశారు. ఆమె శుక్రవారం ఇంటి వద్దే మృతిచెందారు. ఆ విషయాన్ని నిడదవోలులోని రాజేశ్వరి రామకృష్ణ మిషన్ లయన్స్ క్లబ్‌కు తెలుపగా వైద్య సిబ్బంది వచ్చి భూలక్ష్మి కార్నియాలను సేకరించారు. వాటిని హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కి తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భూలక్ష్మి కుమారులు మద్దుకూరి గంగాధరరావు, మద్దుకూరి ఆనం దరావు కుమార్తెలు ప్రభావతి, వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే గోపాలపురం మండలం దొండపూడికి చెందిన కొమ్మిరెడ్డి కొండయ్య శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందగా కుటుంబ సభ్యులు సేవా దృక్పథంతో ఆయన కళ్లను దానం రాజమహేంద్రవరంలోని రాధాకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి వెల్లంకి జయశివ సూర్యం, సభ్యులు, అమ్మా బ్లడ్ బ్యాంక్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తినష్టం.. యర్నగూడెంలో ఘటన


యర్నగూడెంలో షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన ఇల్లు


అగ్నికి ఆహుతవుతున్న ఇల్లు

దేవరపల్లి, ఆగస్టు 2: మండలంలోని యర్నగూడెంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ తో ఓ ఇల్లు దగ్ధమై రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు కుటుంబ సభ్యులు, రెవెన్యూ అధికారులు తెలిపారు. గ్రామంలో కందివలస మహాలక్ష్మమ్మ ఇంట్లో అడపాక అడపాక గోవిందమ్మ కుటుంబం అద్దెకు ఉంటోంది. శుక్రవారం ఉదయం గోవిందమ్మ దంపతులు వ్యవసాయ పనులకు వెళ్లగా పిల్లలిద్దరూ స్కూల్‌కి వెళ్లారు. 10 గంటల సమయంలో గోవిందమ్మ ఇంట్లోంచి ఒక్కసారిగా మంటలు రావడంతో ఇంటి వద్దే ఉన్న మహాలక్ష్మమ్మ కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. కానీ ఇంట్లో రెండు గ్యాస్ సిలిండర్లు ఉండడంతో మంటలు వ్యాపించి ఇరు కుటుంబాల్లో గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. నిడదవోలు ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఇల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. రూ.80 నగదు, 12గ్రాములు బంగారం, 20గ్రాములు వెండి అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. సంఘటనా స్థలాన్ని టీడీపీ నాయకులు పరిశీలించి, ఆర్థిక బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. సర్పంచ్ బొంతా భరత్‌బాబు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రెవెన్యూ అధికారులు బియ్యం, నగదును అందజే శారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, జూనియర్ కళాశాల చైర్మన్ గద్దే శ్రీనివాస్, ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

గోష్పాదేశ్వరస్వామికి అష్టోత్తర జ్యోతిర్లింగార్చన

కొవ్వూరు, ఆగస్టు 2: గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అష్టోత్తర జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయార్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో కొవ్వూరులోని రైల్వేస్టేషన్ సమీపంలోని సంస్కృతోన్నత పాఠశాల ప్రాంగణంలోని శ్రీ లలితాపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతి పూజ, శివునికి ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమం, లలితాదేవికి సామూహిక కుంకుమ పూజలు, అష్టోత్తర జ్యోతిర్లింగార్చన చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా కిరణ్‌శర్మ



ఉండ్రాజవరం, ఆగస్టు 2: ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని తాడిపర్రు గ్రామానికి చెందిన కోడూరి సాయివిశ్వనాథ మణికంఠ కిరణ్‌శర్మ నియమితులయ్యారు.ఈ మేరకు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పొదలి నారాయణమూర్తి శుక్రవారం నియామకపత్రం అందజేశారు.ఈ మేరకు నియామక పత్రాన్ని విశాఖపట్టణంలో తీసుకున్నట్లు కిరణ్‌శర్మ శుక్రవారం విలేకరులకు తెలిపారు. సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

నెల రోజులుగా కలుషిత నీరే దిక్కు

- తరచూ నల్లగా, మట్టితో వస్తున్న తాగునీరు
- కొవ్వూరు పట్టణ పౌర సంఘం ఆగ్రహం
- మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం


మున్సిపల్ మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పౌర సంఘం నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 2: కొవ్వూరులో నెల రోజులుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని, పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పట్టణ పౌర సంఘం కన్వీనర్ పడాల గంగాధరరావు పేర్కొన్నారు. సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ మేనేజర్ జి.రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ కొవ్వూరులో నెల రోజులుగా మున్సిపాల్టీ సరఫరా చేస్తున్న తాగునీరు ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగజేస్తోందని, తాగడానికి వీలు లేకుండా కలుషితంగా వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటిలో డ్రైనేజీ వాటర్ కలుస్తున్నట్లుగా తరచూ నల్లగా, మట్టితో కలిసి వస్తోందన్నారు. దీనికితోడు రోజూ క్లోరినేషన్ చేయకపోవడంతో నీరు బూడిద రంగులో వస్తోందని వివరించారు. ఇందిరమ్మకాలనీ, 22వ వార్డుల్లో నీరు తాగడానికి వీలు లేకుండా ఉంటున్నాయన్నారు. అసలే వర్షాకాలం తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు హెచ్చరికలు జారీచేసిరా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పట్టణంలో పైపులైను మరమ్మతుల పేరుతో ఎక్కడికక్కడ గుంతలు తవ్వి రోజులు తరబడి అలాగే వదిలి వేశారని, ఆ గుంతల్లో వర్షపునీరు, మురుగునీరు చేరుతోందన్నారు. పైపులైను లీకులను పూర్తిస్థాయిలో అరికట్టకపోవడంతో నీరు కలుషితం అవుతుందన్నారు. తాగునీటి పైపులైను లీకులను పూర్తిస్థాయిలో అరికట్టి, సురక్షిత నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని, గోతులు ఏర్పడ్డాయని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. వీధి కుక్కల బారినుంచి ప్రజలను కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో దగ్గు రాధాకృష్ణ, తవిటయ్య, హరి తదితరులు పాల్గొన్నారు. దీనిపై మున్సిపల్ మేనేజర్ రాధాకృష్ణ స్పందిస్తూ మున్సిపాల్టీ సరఫరా చేసే తాగునీటిని శాంపిల్ తీసి టెస్టింగ్‌కు పంపిస్తామన్నారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

5న అభ్యంతరాల స్వీకరణ.. గోపాలపురం ఎంఈవో శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

గోపాలపురం, ఆగస్టు 2: ప్రభుత్వ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎంఈవో జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మండలంలో 38 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్, 2 గురుకుల పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రధానోపాధ్యాయులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 1 నుంచి ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 5న అభ్యంతరాల స్వీకరణ, 8వ తేదీ ఉదయం 7గంటల నుంచి 1గంట వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, ప్రమాణస్వీకారం చేయించి తల్లిదండ్రులతో మొదటి సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అప్పటి వరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పుతో హర్షం


చాగల్లులో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ యువత


మోర్తలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చాగల్లు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు పట్ల చాగల్లులో ఎమ్మార్పీఎస్, పలువురు నాయకులు హర్షం వ్యక్తంచేశారు. పార్టీ యువత ఆధ్వర్యంలో బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూ తిగిరిపల్లి సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ దీర్ఘకాల పోరాటానికి తగిన న్యాయం జరిగిందన్నారు. మంద కృష్ణ మాదిగా పోరాటం మరువలేనిదన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జొన్నకూటి వెంకాయమ్మ, బొల్లిపో ఆనందరావు, జొన్నకూటి సుబ్బారావు, బి.సురేష్, బి.ఆనందరావు, ఎస్.లోకేష్ పాల్గొన్నారు. ఎస్.ముప్పవరంలో సర్పంచ్ ముప్పిడి మహలక్ష్మి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఎన్‌డీఏ నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని చివటం, వెలగదుర్రు, ఉండ్రాజవరం, మోర్త గ్రామాల్లో గురువారం రాత్రి జరిగిన విజయోత్సవ కార్యక్రమాలకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిద్దే మధుబాబు, మండలాధ్యక్షుడు, న్యాయవాది బొల్లిపో సునీల్‌రాజ్ విచ్చేసి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణ కల నెరవేరిందని, ఎస్సీలోని 59 కులాలకు సమాన న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీలోని అన్ని కులాలు అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ ద్వారా సాధ్యమని చెప్పారు. కార్యక్రమాల్లో దూలపల్లి జయరాజు, గాలింకి వెంకట్, గాలింకి సంతోష్, బ్రహ్మానందం, కిశోర్ ఏసోబు, సత్యనారాయణ, సూర్యచంద్రం, రామారావు, గాలింకి ప్రతాప్ పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి మెరుగు

తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి


గోపాలపురం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల దృశ్యం

గోపాలపురం, ఆగస్టు 2: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు పట్టించడంతో బిడ్డల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గోపాలపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు పట్టడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరిగి బిడ్డ అనారోగ్యం భారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన అవగాహన కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ అలీ మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకూ తల్లి పాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉండడంతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలో చీపురుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి విచ్చేసి బాలింతలకు, గర్భిణులకు తల్లి పాలు ఆవశ్యకతను వివరించారు. తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమని బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల పాటు కేవలం తల్లి పాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు పౌష్టికాహారంతోపాటు వ్యాధి నిరోధక శక్తి మెరుగు పడుతుందన్నారు. అనంతపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో అచ్చన్నపాలెం, దూబచర్ల సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.హరతి ఆధ్వర్యంలో ఘంటవారిగూడెంలో తల్లి పాలు వారోత్సవాలు జరిగాయి. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సర్పంచ్ రాజులపాటి సుభాషిణి, ఆదినారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు చెల్లు సుశీల, వరలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.


తాళ్లపూడిలో వారోత్సవాలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది


నల్లజర్ల: చీపురుగూడెంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న వెంకటలక్ష్మి

కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ


విద్యార్థినికి పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

గోపాలపురం, ఆగస్టు 2: ఉన్నత విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన దాఖలాల్లేవన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పాఠ్యపుస్తకాలు త్వరగా అందేలా చూస్తానని, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రషీద్ అహ్మద్, టీడీపీ నాయకులు జ్యేష్ఠ శ్రీధర్, ఈలి శరత్‌బాబు, భూరెడ్డి వాసు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి


కొవ్వూరులో పింగళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాళ్లపూడి, ఆగస్టు 2: మండలంలోని ప్రక్కిలంకలోని మండల పరిషత్ స్పెషల్ పాఠశాలలో శుక్రవారం భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. సంస్థ మండలాధ్యక్షుడు అంకెం సురేష్ మాట్లాడుతూ 1876లో కృష్ణా జిల్లా భట్లు పెనుమర్రులో జన్మించిన పింగళి వెంకయ్య జాతీయపతాకం రూపొం దించారని, అది 1947 జూలై 22న రాజ్యాంగ సభ సమావేశంలో ఆమోదించబడిం దన్నారు. కార్యక్రమంలో మానవత బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు, అప్పన చంద్రధరగుప్త, చెరుకు ఆంజనేయులు, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాగోలపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈతకోట సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక వేద సంస్కృత కళాశాలలో ప్రిన్సిపాల్ గౌరీశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. భారత్ వికాస్ పరిషత్ కొవ్వూరు అధ్యక్షుడు వై.రమేష్ ఎం.వాణికుమారి, ఆచార్య ఏపీ లోకేష్, గీతాలక్ష్మి పాల్గొన్నారు.

సముద్రంలోకి 1481 టీఎంసీలు

- సాధారణ స్థాయికి గోదావరి.. 10.50 అడుగులకు నీటిమట్టం
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ


కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

ధవళేశ్వరం, ఆగస్టు 2: రెండు వారాలుగా ఉరకలు వేస్తూ ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా సాధారణస్థాయికి చేరుకుంటోంది. శుక్రవారం తెల్లవారుజామున 2గంటలకు నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గి 9.86లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తుండడంతో 11రోజులుగా కొనసాగిన మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించారు. ఆపై క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి 7గంటలకు 10.50అడుగులకు తగ్గింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 8,37,740 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో అన్నిచోట్ల నీటిమట్టాలు తగ్గుముఖం పట్టి సాధారణస్థాయికి చేరుకుంటున్నాయి. భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 34.10 అడుగులుగా నమోదైంది.

జూలై 22 నుంచి నేటి వరకూ వరద ఇలా..

వరదల సీజన్ మొదలై ఇప్పటివరకు అంటే జూన్ నెల నుంచి శుక్రవారం వరకు ధవళేశ్వరం కాటన్‌బ్యారేజ్ నుంచి 1481.79 టీఎంసీల వరదనీరు సముద్రంలోకి ప్రవహించింది. అంతకుముందు అంటే ఏప్రిల్‌లో గోదావరిలో లభించిన నీరు 2టీఎంసీలు మాత్రమే. గోదావరికి వరద ప్రవాహం వచ్చి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ ద్వారా 10లక్షల క్యూసెక్కులు ప్రవహించడంతో జూలై 22న మొదటి ప్రమాదహెచ్చరిక జారీ అయింది. ప్రవాహం మరింత పెరగడంతో 23న రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై వరద ప్రవాహం తగ్గడంతో 25న రెండో ప్రమాదహెచ్చరికను ఉపసంహరించగా మరలా నీటిమట్టం 13.75అడుగులకు పెరగడంతో 27న రెండో ప్రమాదహెచ్చరిక జారీ అయింది. నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 15.80అడుగులకు చేరుకుని 16లక్షల క్యూసెక్కులు పైగా సముద్రంలోకి ప్రవహించింది. నీటిమట్టం తగ్గడంతో 30న రెండో ప్రమాదహెచ్చరికను ఉపసంహరించారు. ఆపై గోదావరి తగ్గుతూ, పెరుగుతూ, నిలకడగా కొనసాగడంతో 3రోజుల పాటు మొదటి ప్రమాదహెచ్చరిక కొనసాగింది. ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున నీటి మట్టం 11.70అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ధవళేశ్వరం వద్ద గోదావరికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీయై ఉపసంహరించే వరకు 11రోజుల పాటు ప్రమాదహెచ్చరికలు కొనసాగాయి. 11రోజుల వ్యవధిలో 1207 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి ప్రవహించింది. కేవలం 11రోజుల వ్యవధిలో సముద్రంలోకి ప్రవహించిన ఈ నీటితో 3డెల్టాల పరిధిలో ఏటా రెండు పంటలకు 10లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించవచ్చు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన వారి నుంచి ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం దరఖాస్తులు కోరుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లకు సంబంధించి ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ (టీటీటీ‌ఇఇట్బ్లుజీచ్‌ట్రజీఇజీషీజీ.జౌరి.జీ)లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు 10వ తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఆధార్, బయోడేటా, తపాలా చిరునామా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలవారు కుల ధ్రువీకరణపత్రం జతచేయాల్సి ఉందన్నారు. వచ్చిన దరఖాస్తులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఆగస్టు 27న విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో జరుగుతుందని పేర్కొన్నారు.

కృష్ణంపాలెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

దేవరపల్లి, ఆగస్టు 2: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణంపాలెంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. నిడదవోలు జాగృతి కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 100మందికి పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మానవత సభ్యుడు తేతల మురళీకృష్ణారెడ్డి ఆర్థిక సాయంతో వృద్ధులకు కళ్లజోళ్లు, స్థానిక అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధాశ్రమానికి ఆర్థిక సహాయం, భోజన వసతి కల్పించారు. కార్యక్రమలో మానవత జిల్లా కమిటీ సభ్యుడు కేశిరాజు వెంకటరాజకుమార్, బండి సూర్యప్రకాశరావు, వెంకటరామారావు, ఈద్పూగంటి నాగేశ్వరరావు, సాయిరెడ్డి, సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సత్తి జగదీశ్వర్‌రెడ్డి, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు శ్యామలాదేవి పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కొవ్వూరు, ఆగస్టు 2: వివాహిత అదృశ్యంపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ జుబేర్ మహ్మద్ తెలిపారు. కొవ్వూరుకు చెందిన కె.సాయి జూలై 31వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకక పోవడంతో సాయి భర్త పూర్ణ చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డైట్ లెక్చరర్, పీఈటీలను అరెస్టు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 2: రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు అధ్యాపకుడు బాలరాజు, పీఈటీ వీరభద్రరావులను అరెస్టు చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. రాజమహేంద్రవరంలో శుక్రవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ పలువురు విద్యార్థినులు కలిసి నిరసన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైట్ కళాశాలలో సెక్యూరిటీగార్డ్, వాచ్‌మెన్ లేరని, విద్యార్థినులకు భద్రత లేదన్నారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు అరకొరగా ఉన్నాయన్నారు. విద్యార్థినులు భరించలేక వారికి వారే ఫిర్యాదు చేసుకుంటేనే విషయం బయటకు వచ్చిందన్నారు. కళాశాలలో పర్యవేక్షణ లేదని ఈ కళాశాలలో జరిగిన దారుణాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని, సస్పెండ్ చేసి వదిలి పెడితే ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతాయని, వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.